Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 301 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 నవంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

### అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు

తిరువనంతపురం: కేరళలోని శబరిమలకు భక్తులు పోటెత్తారు. అయ్యప్పస్వామి దర్శనాలు తెల్లవారు జాము నుంచి ప్రారంభం కావడంతో భక్తులు ఆలయానికి క్యూకట్టారు. పవిత్రమైన మలయాళ మాసం వృచికం మొదటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు పుజారులు ఆలయ తెలుపులు తెరిచారు. రెండు నెలల పాటు దర్శనాలు కొనసాగనున్నాయి. దీంతో అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది యాత్రికులు, భక్తులు శబరికి తరలి వస్తున్నారు. ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రతి ఏడాది దక్షిణ భారతదేశం నుంచి వచ్చే భక్తులతోనే శబరిమల యాత్ర ప్రారంభమవుతుంది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు శబరికి క్యూ కట్టారు.

# ఆచితూచి అడుగేయాలి

## విచక్షణ జ్ఞానంతో ఓటు వేయాలి.. లేదంటే ఐదేండ్లు బాధపడాలి : సీఎం కేసీఆర్



జనగామ : ఎన్నికల్లో ఆషామాషీగా, అలవోకగా.. చిన్నాయన చెప్పిండని.. బామ్మర్ది చెప్పిండని ఓటు వేయొద్దని.. సొంత విచక్షణతో ఓటు హక్కును వినియోగించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. జనగామ నియోజకవర్గంలోని చేర్యాలలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ప్రజాస్వామ్య ప్రక్రియలో రావాల్సినంత పరిణితి రాలేదు. ఎక్కడైతే వచ్చిందో ఆ దేశాలు బ్రహ్మాండంగా దూసుకుపోతున్నాయి.

మనదగ్గర ఎలక్షన్లు వచ్చినయంటే అన్నీ అబద్ధాలు, అభాండాలు, బద్నాంలు, బట్టకాల్చిమీదేసుడు, లొల్లులు, కొట్లాడుకునడు.. కత్తులుపట్టి పొడుసుడు ఇవన్నీ కళ్లారా చూశాం. అమెరికాలాంటి దేశాల్లో సభలు కూడా జరుగవ్. టీవీల్లోనే మాట్లాడుతరు. పార్టీ పాలసీ చెబుతరు. దానిపైనే ప్రజలు ఓటేస్తరు. ఆ పరిణితి కొంచెం కొంచెం వస్తున్నప్పటికీ ఇంకా రావాల్సిన అవసరం ఉంది. మన దేశంలో అది బాగా రావాలని మనసారా కోరుకుంటున్నా'నన్నారు.

**అభ్యర్థుల వెనుక పార్టీల చరిత్రను చూడాలి..** 'ఎన్నికల్లో పార్టీకొకరు నిలబడుతరు. ఎట్లయిన 30వ తారీఖున ఓట్లు పడుతయ్. 3 తారీఖున లెక్కబడుతరు. ఆడికి దుకాణం అయిపోతది. ఇది జనరల్‌గా మనకు తెలిసిన లెక్క. అసలు లెక్క అది కాదు. ఎన్నిక వస్తే ఏం జరగాలంటే.. నిలబడ్డ వ్యక్తి గుణం, గణం చూడాల్సిందే. ఎలాంటి వ్యక్తి ? ఏం చేస్తడో చూడాలి. ముఖ్యంగా అభ్యర్థుల వెనుక పార్టీల చరిత్రను చూడాలి. ఆ పార్టీల నడవడిక, దృక్పథాన్ని పరిశీలించాలి. రాష్ట్రం యొక్క ఆర్థిక స్థితి గురించి వాళ్ల అవగాహన ఏంది. వాళ్లకు రాష్ట్రాన్ని అప్పగిస్తే ఎటు తీసుకుపోతరు? ఈ విషయంపై ప్రతి గ్రామంలో చర్చ జరిగితే అది నిజమైన ప్రజాస్వామ్యం. అప్పుడు తెలివితోని ఓటు వేసినట్లవుతుంది. తప్పకుండా తెలివికల్ల ప్రభుత్వం వస్తుంది. రాష్ట్రానికి మంచి జరుగుతుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు నేను చెప్పే నాలుగు మాటలను గ్రామాల్లో చర్చ పెట్టాలి. నిజానిజాలు తేల్చాలని కోరుతున్న. ప్రజాస్వామ్యంలో ప్రజల దగ్గర ఉండే ఒకేఒక వజ్రాయుధం ఓటు. అది సామాన్యమైటువంటిది కాదు. ఆషామాషీగా అలవోకగా.. మా చిన్నాయన చెప్పిండు.. బామ్మర్ది చెప్పిండని ఓటు వేయాల్సింది కాదు. సొంత విచక్షణతో ఓటుహక్కును వినియోగించాలి. ఐదుసంవత్సరాలు రాష్ట్రం తలరాతను, తద్వారా మనందరి తలరాతను ఓటు మారుస్తుంది. చైతన్యం లేని ప్రజలను చైతన్యవంతం చేయాలి. చైతన్యం ఉన్న యువత వాస్తవాలపై చర్చ పెట్టాలి. అప్పుడు నిజమైన ప్రజాస్వామిక పరిణితి వచ్చే అవకాశం ఉంటుంది. మేలు జరిగే అవకాశం ఉంటుంది' అన్నారు.

**బీఆర్ఎస్ పని చేస్తున్నదే తెలంగాణ కోసమే..** 'బీఆర్ఎస్ పార్టీ చరిత్ర మీ అందరి కండ్ల ముందే ఉన్నది. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజల హక్కుల కోసం. పని చేస్తున్నది కూడా తెలంగాణ కోసమే. కాంగ్రెస్ చరిత్ర కండ్ల ముందున్నది. బీఆర్ఎస్ మీ ఆశీర్వాదంతో పదేళ్లుగా అధికారంలోకి ఉన్నది. అంతకు ముందు కాంగ్రెస్ 50 సంవత్సరాలు అధికారంలో ఉంది. 50 సంవత్సరాల కాలంలో వాళ్లు ఏం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ నడక ఏంది? అనేదానిపై చర్చించాలి. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం. కాంగ్రెస్ చరిత్రనేమో ఉన్న తెలంగాణను ముంచింది. మన తెలంగాణ మనకే ఉండే. దాన్ని జబర్దస్తీగా తీసుకుపోయి తెలంగాణ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రాలో కలిపి 58 ఏళ్లు ఏడిపించారు. 1969 సంవత్సంలో పిట్టల్లా 400 మందిని కాల్చి చంపారు. 2001 మనందరం కలిసి మొదలుపెడితే 2004లో మనతో పొత్తు పెట్టుకుంటమని ముందుకువచ్చారు. తెలంగాణ ఇస్తమని మాట ఇచ్చారు. మరి 2004లో పొత్తుతో ఇక్కడ, ఢిల్లీలో అధికారం వచ్చింది. 2005, 2006లో తెలంగాణ ఇవ్వాల్సి ఉన్నా.. ఇవ్వకుండా ధోఖా చేసింది మనం మొండిగా కొట్లాడం. రాజీపడలేదు' అన్నారు.

**పదేళ్ల తర్వాత తెలంగాణ ఉట్ల ఉన్నదో ఆలోచన చేయాలి..** 'ఎట్లన్న మూవ్‌మెంట్‌ను కిందమీద చేయాలని చూశారు. ఎమ్మెల్యేలను కొనాలని చూశారు. టీఆర్ఎస్ పార్టీని చీల్చాలని చూశారు. చాలా కుట్రలు చేశారు. చివరకు నాకు తిక్కరేగి తెలంగాణ వచ్చుడో కేసీఆర్ వచ్చుడో ఏదే ఒకటి తేలాలని ఆమరణ దీక్షకు దిగితే.. ప్రజలు ఉప్పెలా ఉద్యమాలు చేస్తే.. 33 పార్టీలు మద్దతు లేఖలు ఇచ్చిన తర్వాత దిక్కులేదురా అని తెలంగాణ ఇచ్చేందుకు ముందువచ్చారు. ఇది మీ కండ్ల ముందే జరిగిన చరిత్ర. నేను భారతం, రామయణం చెబుతలేను. ఇవాళ పదేళ్లయ్యింది తెలంగాణ వచ్చి. మీ ఆశీర్వాదంతో ప్రభుత్వం నడుస్తున్నది. మనం ఓ మార్గం వేసుకున్నాం. తెలంగాణ వచ్చిన నాడు.. రాక ముందు.. పదేళ్లకు ముందు తెలంగాణ.. పదేళ్ల తర్వాత తెలంగాణ ఎట్ల ఉన్నదో ఆలోచన చేయాలి' అన్నారు.




యుద్ధంలోకి దిగాక వెనుకడుగు వేయడం ఉండదు.. చా వో.. రేవో వార్‌లోనే తేల్చుకుంటారు.! ఇది యుద్ధంలో ఉండే పరిస్థితి.. ఇప్పుడు ఇదంతా ఎందుకంటారా..? ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ పోరు జరుగుతోంది. నువ్వా.. నేనా? అన్నట్టుగా పొలిటికల్ ఫైటింగ్ జరుగుతోంది.

పార్టీలన్నీ సర్వం ఒడ్డి పని చేస్తున్నాయి. సమయం తక్కువ.. ప్రచారం ఎక్కువ. దీంతో నేతలంతా తీరిక లేకుండా ప్రచారం లో మునిగి తేలుతున్నారు. కనీసం రెస్ట్ తీసుకునేందుకు కూడా టైమ్ లేక నేతలు తెగ ఇబ్బంది పడిపోతున్నారు. ఓ వైపు హ్యాట్రిక్ కోసం బీ ఆర్ఎస్ పోరు సాగిస్తుండే.. ప్రతిపక్షాలేమో అధికారం కోసం సర్వశక్తు లు ఒడ్డుతున్నాయి. దీంతో నేతలంతా బిజిబిజీగా సాగిపోతున్నారు.

## అయ్యో.. నేతలకు ఇలా అవుతోందేంటి?

**ఇవాళ ఇలా..! :** ఇక ముఖ్య నేతలైతే కనీసం విశ్రాంతి తీసుకునే అవకాశం లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత అస్వస్థతకు గురయ్యారు. శనివారం జగిత్యాల నియోజకవర్గంలోని ఇటిక్యాలలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కొద్ది సేపటికే కవిత ఇబ్బందికి గురయ్యారు. ప్రచార రథంపై ఉన్నప్పుడు కళ్లు తిరగడం.. గుండెలపై చేయి వేసుకుని ఇబ్బంది పడ్డారు. డీహైడ్రేషన్‌తో కళ్లు తిరిగి కిందపడిపోయారు. దీంతో వెంటనే అక్కడే ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు సపర్యలు చేశారు. కొద్దిసేపు రెస్ట్ తీసుకున్న అనంతరం కవిత కోలుకుని వెంటనే బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ తరపున ప్రచారం నిర్వహించారు.

**మొన్న ఇలా..! :** కొద్ది రోజులు క్రితం కవిత సోదరుడు, మంత్రి కేటీఆర్ కూడా తీరిక లేకుండా సాగిపోతున్నారు. నామినేషన్ల సమయంలో ఆర్మూర్‌లో ఓపెన్ టాప్ వాహనంపై నేతలతో వెళ్తుండగా డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో రేలింగ్ విరిగిపోయి కేటీఆర్‌తో సహా నేతలంతా కింద పడిపోయారు. కేటీఆర్‌ను సెక్యూరిటీ పట్టుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షేమంగా బయటపడడంతో పార్టీ శ్రేణులు ఊపిరిపీల్చుకున్నారు. మొన్న కేటీఆర్‌కు..

ఈరోజు కవితకు ఇలా జరగడంపై బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. రెస్ట్ తీసుకోకపోవడంతోనే ఇలా జరుగుతోందని పార్టీ శ్రేయోభిలాషులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలంటూ నేతలు సూచిస్తున్నారు. పైగా ఎలక్షన్‌కు సమయం కూడా లేదు. కేవలం పదంటే.. 10 రోజులే ఉంది. ఈ పీక్ సమయంలో హెల్త్‌ను కాపాడుకుంటూనే ప్రచారం సాగిస్తారో.. ఏమైనా ఫర్వాలేదని ముందుకు సాగిపాతారో చూడాలి మరి.



## డిసెంబర్ 9న డెఫినెట్‌గా క్లీన్ షేవ్‌తో కనిపిస్తా

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేడు ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. డిసెంబర్ 9న డెఫినెట్‌గాక్లీన్ షేవ్‌తో కనిపిస్తానన్నారు. తమ మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. కానీ 420 లకి అన్ని 420 లాగే కనిపిస్తాయని విమర్శించారు.

బీఆర్ఎస్ నేతలు మెంటల్‌తో రబ్బిష్ మాట్లాడుతున్నారన్నారు. కర్ణాటక వెళ్లి వచ్చానని.. అక్కడి గ్యారెంటీ స్కీములు అమలవుతున్నాయన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి అంశానికి కట్టుబడి ఉంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోరని ఆ పార్టీ గ్యారంటీ ఇస్తుందా?: బండి సంజయ్

భైంసా: రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ పని ఖతం అయ్యిందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విమర్శించారు. భైంసాలో నిర్వహించిన భాజపా ఎన్నికల ప్రచార సభలో బండి సంజయ్ పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబం వల్ల తెలంగాణ రాలేదని.. ప్రజలందరి పోరాటం వల్లే వచ్చిందన్నారు. కేంద్రంలో మరోసారి నరేంద్రమోదీ నేతృత్వంలో భాజపా ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్.. దేశంలో ఎక్కడుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలు ఇస్తే ఏంటి.. ఇయ్యకపోతే ఏంటని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో ఇచ్చిన 6 గ్యారంటీలు ఏమయ్యాయని అక్కడి ప్రజలు నిలదీస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని కర్ణాటక నుంచి రైతులు, యువకులు తెలంగాణకు వచ్చి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆరు స్కీమ్‌లు.. అరడజను ముఖ్యమంత్రులు అన్నట్టుగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు.. అమ్ముడుపోరని ఆ పార్టీ గ్యారంటీ ఇస్తుందా? అని ప్రశ్నించారు. ముథోల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే భాజపా అభ్యర్థి రామారావుపటేల్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాందేడ్ నుంచి నిర్మల్ వరకు రైలు సదుపాయం కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పీజీ కాలేజీ, పెద్దాసుపత్రి, యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ టైం అయిపోయింది.. బీజేపీ టైం వచ్చింది: అమిత్ షా




గద్వాల: తెలంగాణలో రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బీసీలకు తీవ్ర అన్యాయం చేశానని, బీజేపీకి అవకాశం ఇస్తే బీసీనే సీఎం చేస్తుందని హామీ ఇచ్చారాయన. శనివారం మధ్యాహ్నం గద్వాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీజేపీ సకల జనుల విజయసంకల్ప సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. "ఇచ్చిన హామీలను కేసీఆర్ నిలబెట్టుకోలేదు. గద్వాల పేదలకు 500 ఇళ్లు ఇస్తానని ఇవ్వలేదు. రైతులకు కనీస హక్కులు ఇవ్వకుండా కేసీఆర్ మోసం చేశారు. అబద్ధపు మాటలతో కేసీఆర్ ప్రజల్ని మోసం చేస్తున్నారు. పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తి చేయలేదు. తెలంగాణలో బీఆర్ఎస్ టైం అయిపోయింది.. బీజేపీ టైం వచ్చింది. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుంది" అని షా ప్రసంగించారు. "కేసీఆర్ హయాంలో స్కామ్‌లెన్నో వెలుగులోకి వచ్చాయి. మిషన్ భగీరథ, కాళేశ్వరం, మద్యం కుంభకోణాలు బయటపడ్డాయి. దేశంలోనే కేసీఆర్ ప్రభుత్వం అత్యంత అవినీతి ప్రభుత్వం. దళితుడ్ని సీఎం చేస్తానని కేసీఆర్ మోసం చేశారు. బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చే టైం వచ్చింది. ..కాంగ్రెస్ పార్టీ తెలుగు రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసింది. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఏపీకి 2 లక్షల కోట్లు ఇస్తే.. కేవలం తెలంగాణకే మోదీ ప్రభుత్వం రెండున్నర లక్షల కోట్లు ఇచ్చింది. కానీ, కేసీఆర్ ప్రభుత్వం నిధుల్ని సక్రమంగా వినియోగించలేదు" అని షా ఆరోపించారు. "కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం అంతా ఒక్కటే. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బీసీలకు అనుకున్నంత స్థాయిలో టికెట్లు ఇవ్వలేదు. అవి బీసీ వ్యతిరేక పార్టీలు. బీజేపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుంది. బీజేపీకి ఓటేస్తే.. బీసీని సీఎం చేస్తాం. ఒక బీసీని ప్రధానిని చేసిన పార్టీ బీజేపీ. కేంద్రంలో 20 మందికిపైగా ఓబీసీలను మంత్రులను చేశాం. తెలంగాణలో అధికారంలోకి వస్తే 4 శాతం ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తాం. ఆ రద్దు చేసిన రిజర్వేషన్లు ఎస్టీలకు, ఓబీసీలకు ఇస్తాం. తెలంగాణలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది బీఆర్ఎస్ ప్రభుత్వం. పేపర్ లీకేజీ కారణంగానే ప్రవళిక అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. ఐదేళ్లలో రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం. ఎంఐఎంకి లొంగిపోయి.. ఎందుకు విమోచన దినోత్సవం జరపడం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక సెప్టెంబర్ 17వ తేదీని అధికారికంగా విమోచన దినోత్సవంగా జరుపుతాం. బీజేపీ అభ్యర్థులకు ఓటేసి గెలిపించండి. బీజేపీని గెలిపిస్తే.. అయోధ్య రామమందిర ఉచిత దర్శనం కల్పిస్తాం" అని షా ప్రసంగాన్ని ముగించారు. జోగులాంబ శక్తి పీఠం కోసం మోదీ సర్కార్ 70 కోట్లు ఇస్తే కేసీఆర్ ప్రభుత్వం ఆ నిధులను ఖర్చు చేయలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. శనివారం నాడు అమిత్ షా గద్వాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.."కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదు. గుర్రం గడ్డ వంతెన, గట్టులిఫ్ట్, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం కేసీఆర్ కేంద్రం దృష్టికి తీసుకు రాలేదు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తక్షణమే అమలు చేస్తాం. 52 శాతం బీసీ ఓటర్లు 130 కులాలున్న బీసీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తోంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం. బీసీలకు బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం 3,300 కేటాయిస్తే.. కేసీఆర్ 77 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. టీఎస్పీఎస్సీ పరీక్షల రద్దు, పేపర్ లీక్‌లతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారు. ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుతాం. ముస్లిం మతపర రిజర్వేషన్లు రద్దు చేస్తాం. దేశంలో, రాష్ట్రంలో 2జీ, 3జీ, 4జీ కుటుంబ పాలన నడుస్తోంది. 2జీ కేసీఆర్ – కేటీఆర్, 3జీ ఓవైసీ మూడు తరాలు, 4జీ గాంధీ 4 తరాలు దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలాయి. తెలంగాణలో బీఆర్ఎస్‌కు విముక్తి కల్పించండి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి మయంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని 70ఏళ్లు నాన్చింది. జనవరి 22వ తేదీన అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ జరగనుంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రజలందరికీ అయోధ్య దర్శనం ఉచితంగా కల్పిస్తాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## బీఆర్ఎస్ ఓవర్ లోడ్ అయిపోయిందా ?

కొందరు సీనియర్ నేతల వ్యవహారం చాలా విచిత్రంగా ఉంది. టికెట్లు రాదని తెలిసినా కాంగ్రెస్ కు రాజీనామాలు చేసి బీఆర్ఎస్ లో చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేస్తున్నారంటే టికెట్లు రాలేదన్న అసంతృప్తితో రాజీనామాలు చేస్తున్నారని అనుకోవచ్చు. మరి వీళ్ళు బీఆర్ఎస్ లో ఎందుకు చేరుతున్నట్లు ? బీఆర్ఎస్ లో చేరినంత మాత్రాన వీళ్ళకు టికెట్లు వచ్చేదిలేదు. ఎందుకంటే అన్నీ నియోజకవర్గాల్లోను కేసీయార్ అభ్యర్ధులను ప్రకటించేశారు. ఇపుడు చేరుతున్న సీనియర్ల కోసం అభ్యర్ధులను మార్చే అవకాశం ఎంతమాత్రం లేదు. టికెట్లు రాదని తెలిసినా సీనియర్లు కాంగ్రెస్ కు రాజీనామాలు చేసి బీఆర్ఎస్ లో చేరటమే విచిత్రంగా ఉంది. కనీసం బీజేపీలో చేరినా ఏదో ఒక పోస్టు దక్కే అవకా శముంది. ఎందుకంటే బీజేపీలో చాలా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పొన్నాల లక్ష్మయ్య, చెరుకు సుధాకర్, నాగం జనార్ధనరెడ్డి, రావుల చంద్రశేఖరరెడ్డి, విష్ణు వర్ధనరెడ్డి లాంటి వాళ్ళని చూసి ఇప్పటికే పార్టీలో ఉన్న నేతలు ఆశ్చర్యపోతున్నారు. గతంలో పార్టీలో చేరిన వాళ్ళకే అప్పట్లో ఇచ్చిన హామీలను కేసీయార్ ఇంతవరకు నెరవేర్చలేదట. అలాంటిది ఇపుడు ఇంతమంది కొత్తగా ఎందుకు చేరుతున్నారో ఎవరికీ అర్ధంకావటంలేదు. పైగా చేరేముందు ఎలాంటి హామీలను అందుకుంటున్నారో కూడా తెలీటంలేదు. మునుగోడు ఉపఎన్నికలో వామపక్షాల మద్దతు లేకపోతే గెలుపు సాధ్యంకాదని కేసీయార్ కు అర్ధమైంది. అందుకనే వాళ్ళతో చర్చలు జురిపి మద్దతు తీసుకున్నారు. కమ్యూనిస్టులు కూడా కష్టపడి బీఆర్ఎస్ అబ్యర్ధిని గెలిపించారు. అవసరం తీరిపోయిన తర్వాత వామపక్షాలను అవతల పాడేశారు. ఈ విషయం అందరి కళ్ళముందు జరిగిందే. అంటే అవసరానికి కేసీయార్ ఎలాంటి హామీలను ఇవ్వటానికి కూడా వెనకాడరన్నది అర్ధమవుతోంది. అవసరం తీరిపోయినా లేదా అవసరం ఉండదని అనుకున్నా పార్టీలనైనా, నేతలనైనా మళ్ళీ దగ్గరకు కూడా చేర్చరు. ఇపుడు చేరుతున్న సీనియర్ల వ్యవహారం కూడా తమకు లాగే తయారవుతుందని ఇదివరకే చేరిన కొందరు సీనియర్లు చెబుతున్నారు. తమకన్నా ముందు పార్టీలో చేరిన వాళ్ళ పరిస్థితిని తెలిసి కూడా చేరుతున్నారంటే ఎలాంటి హామీలు అందుకుంటున్నారో ఏమో చూడాలి.

# ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు...

## జిల్లా నోడల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం...

## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్




గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని... ఈ విషయంలో జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కలిసి జిల్లాలోని నోడల్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ%ూ% మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఎన్నికల్లో అక్రమంగా నగదు పంపిణీ, మద్యం, డ్రగ్స్ వంటి ఇల్లీగల్ కార్యక్రమాలు జరగకుండా ఎస్ ఎస్ టీ, ఎఫ్ ఎస్ టీ బృందాలు ఇప్పటి వరకు చేసిన కేసులు, పనులకు సంబంధించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అలాగే జిల్లాలో వ్యయపరిశీలకుల బృందంలో తీసుకున్న చర్యలపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. సీ%--%విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 229 ఫిర్యాదులు రాగా వాటికి సంబంధించి సమస్యలు పరిష్కరించినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. కంట్రోల్ రూమ్కు వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2050కి వచ్చిన ఫిర్యాదులు, ఫోన్ కాల్స్కు పూర్తి సమాచారాన్ని సేకరించారు. స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఓటర్ల అవగాహన, ఓటు ప్రాముఖ్యత తదితర వివరాలు చేపడుతున్నట్లు అధికారులు వివరించగా మరింత అవగాహన కల్పించాల్సిందిగా వారికి సూచించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్కు సంబంధించి ఇంటింటికీ వెళ్ళి ఇప్పటి వరకు సేకరించిన వివరాలు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ చర్చించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. దీంతో పాటుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్కు 2,419 కాల్స్ వచ్చినట్లు అధికారులు కలెక్టర్కు తెలిపారు. దీనిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా చెక్పోస్టుల వద్ద ఉండే అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. అలాగే జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు, అవసరమైన పోలింగ్ సిబ్బంది ఉన్నారా ? తదితర వివరాలను తెలుసుకొన్నారు. ఎన్నికల రోజున వెబ్కాస్టింగ్ చేయడానికి అందులో అవగాహనవున్నా సిబ్బందిని నియమించుకొనేలా ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఫారం 12 డి క్రింద 80 సంవత్సరాలు పైబడ్డ, పి డబ్ల్యు డి ఓటర్లకు ఇంటి వద్ద నుండే ఓటు వేయడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడంతో ముందుగా ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్ద నుండే ఓటు వేసే సందర్భంలో అన్ని పార్టీల నాయకులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారిఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో శాసనసభ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగేలా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఈ విషయంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం నోడల్ అధికారులు కొన్ని అంశాలను సమావేశంలో ప్రస్తావించగా అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

# ఆయుష్మాన్‌భవ.. వసూలు తోవ



ఖమ్మం : పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనను ప్రవేశపెట్టింది. ఈ పథకంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన లేదు. పథకంలో వివరాల నమోదుకు తొలుత ఈకేవైసీ చేయించుకోవాలంటూ కొన్ని రోజులుగా పల్లెల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు దాన్ని ఎవరు మానిటరింగ్ చేస్తున్నారనేది తెలియదు. కొన్ని రోజులుగా జిల్లాలో ప్రైవేటు సంస్థల వ్యక్తులు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో చూపించే ఆయుష్మాన్‌భవ కార్డుల్లో తేడాలుండటంతో సామాన్యులు గందరగోళానికి గురవుతున్నారు.

తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి

కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ కింద ఏడాదికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తుంది. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కసరత్తు మొదలైంది. తొలుత ఏఎన్‌ఎం, ఆశలకు ఇచ్చి పేదల వివరాలను ఆన్‌లైన్ చేయాలని అనుకున్నారు. పని ఒత్తిడితో వారు ఈ బాధ్యతలు చేపట్టడానికి విముఖత చూపటంతో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. అదికూడా నత్తనడకన సాగుతుంది. ఇటీవల గ్రామాల్లో ఈకేవైసీ కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రక్రియను చూస్తున్న సంస్థతోపాటు, కామన్ సర్వీసు కేంద్రం వాళ్లు దీన్ని చేస్తున్నారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమైతే ఓటీపీతో, లేకుంటే లబ్ధిదారుని వేలిముద్రతో ఈకేవైసీ చేయాలి. దీన్ని ఉచితంగా చేయాలని ప్రభుత్వం సూచించినా క్షేత్ర స్థాయిలో రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఇటీవల కొణిజర్ల మండలం మల్లుపల్లి, రామనర్సయ్యనగర్‌లో రూ.50 వరకు వసూలు చేయగా, కొణిజర్ల, పల్లిపాడులో రూ.30 వరకు తీసుకున్నారు. జిల్లాలోని ఇతర మండలాల్లోనూ రూ.30 నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రూ.100 వరకు దండుకుంటున్నారు. ఇప్పటికే సామాన్యుల నుంచి ఇలా రూ.లక్షల్లో వసూలు చేశారు.

గందరగోళం

నమోదుపై క్షేత్ర స్థాయిలో స్పష్టత లేదు. వైద్యశాఖ పర్యవేక్షణ లేదు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో ఎవరు ఏమి చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. ముఖ్యంగా అసలు ఏజెన్సీ వాళ్లు ఎవరో, కామన్ సర్వీసు కేంద్ర వాళ్లు ఎవరో అర్థంకావటం లేదు. మరోవైపు ఆన్‌లైన్‌లో లబ్ధిదారుడి వివరాలు నమోదు చేశాక మొబైల్‌లో ఈకేవైసీ చేసినవారు ఒక రకమైన కార్డును చూపిస్తుంటే, మరొకరు వేరే కార్డును చూపిస్తున్నారు. లైవ్ ఫొటో తీయాల్సి ఉండగా గతంలో ఉన్న ఫొటోలను తీసుకుంటున్నారు. దీనివల్ల తప్పులు దొర్లి వైద్య సేవలు అవసరం ఉన్న సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే గందరగోళానికి తెరపడుతుంది.

‘ఆయుష్మాన్ భవ పథకంలో ఈకేవైసీ ఉచితంగానే చేయాలి. ఆ పథకాన్ని ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. గతంలో ఏఎన్‌ఎంలు చేయాలని ప్రతిపాదన ఉండగా పని ఒత్తిడి ఉండటంతో అది వీలుపడ లేదు. నగదు తీసుకునే విషయంపై ఆరా తీస్తాం.’

డాక్టర్ రాంబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో‘ఆయుష్మాన్ భవలో భాగంగా గ్రామాల్లో అర్హులకు సంబంధించి ఈకేవైసీ చేస్తున్నాం. సిబ్బంది మెయింటనెన్స్ కోసం రూ.30 తీసుకుంటున్నాం. కొంతమంది గ్రామాల్లో ఇదే అదునుగా రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తూ ఈకేవైసీ చేస్తున్నారు. కార్డుల తీరుతెన్నులపై ఇంకా స్పష్టత లేదు.’రమేశ్, ప్రైవేటు సంస్థ జిల్లా సమన్వయకర్త.

## బి ఆర్ ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా...

## ఉద్దమర్రి బి ఆర్ ఎస్ కార్యకర్తల ప్రచారం...

శామీర్ పేట (గరుడ వార్త) : మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన పార్టీ కార్యకర్తలు కృషి చేస్తున్నారు. మూడుచింతలపల్లి మండల పరిధిలోని ఉద్దమర్రి గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్తలు శనివారం ఇంటింటి ప్రచార



కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్తూ బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను, రేపు అమలు చేయబోవు హామీలను వివరిస్తూ బిఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలంటూ గ్రామస్తులను తమ పార్టీ పట్ల జాగృతం చేస్తున్నారు.

## తెలంగాణ కోసం తన ప్రాణాలైనా లెక్కచేయని కేసీఆర్ తోనే తెలంగాణ అభివృద్ధి....

### మల్లారెడ్డి ని గెలిపిస్తే కేసీఆర్ గెలుపుకు దోహదపడినట్లే... చామకూర శాలిని మహేందర్ రెడ్డి

శామీర్ పేట (గరుడ వార్త) : తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తన ప్రాణాలనే పణంగా పెట్టి, కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించి, అభివృధికి బంగారు బాటలు వేసిన కేసిఆర్ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని చామకూర షాలిని మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం షామీర్పేట మండల పరిధిలోని మురహరపల్లి, యాడారం గ్రామాల్లో ఆమె టిఆర్ఎస్ పార్టీ తరఫున ఇంటింటి బొట్టుప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతుల జీవితాలను కారు



చీకట్లతో కటిక దరిద్రులు చేసిన కాంగ్రెస్ నియంత పరిపాలనను, ఇంకా ప్రజలు మర్చిపోలేదని ఆమె అన్నారు. కాంగ్రెస్ నమ్మేందుకు తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని, వారి కల్లబొల్లి మాటల్ని ఎవరు నమ్మరని ఆమె అన్నారు. ప్రచారంలో ఆమె వెంట శామీర్పేట మండల బి ఆర్ ఎస్ పార్టీ అద్యక్షులు సుదర్శన్, ఎంపీపీ ఏళ్లభాయి బాబు, షామీర్పేట మండల్ సర్పంచ్ల అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ షామీర్పేట్ మండల్ యూత్ అధ్యక్షులు నరసింహారెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ జగదీష్ గౌడ్, మురహర్ పల్లి సర్పంచ్ ధార భాస్కర్, యాడారం సర్పంచ్ సుజాతరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ హనుమాన్ దాస్ తోపాటుగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైపు ప్రజలు...

### కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం అభ్యర్ధి తోటకూర వజ్రేష్ యాదవ్.

శామీర్ పేట (గరుడ వార్త) : మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం శామీర్ పేట్ మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్ షామీర్పేట ఎంపీటీసీ దప్పు సాయితో పాటుగా, భారీ సంఖ్యలో ఇతర పార్టీ నాయకులు, మేడ్చల్ నియోజకవర్గం అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమెల్యే సుదీర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ... ప్రజల్లో రోజురోజుకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరుగుతుందని, అందుకు నిదర్శనం రోజురోజుకు పార్టీలో పెరుగుతు



న్న చేరికలేనని అన్నారు. మల్లారెడ్డి అన్యాయాలను సహించలేక పార్టీని వీడు మరి కాంగ్రెస్ లో చేరుతున్నారని ఆయన అన్నారు. మల్లారెడ్డి చేసిన అవినీతి అక్రమాలను వదిలిపెట్టబోమని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా చర్యలు తప్పవని అన్నారు, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ... మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు మంత్రి మల్లారెడ్డిపై తిరగబడుతున్నారని, రోజు రోజు కాంగ్రెస్ లో పెరుగుతున్న ఇతర పార్టీల నాయకుల చేరికలు చెప్పగానే చెబుతున్నాయని అన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ షామీర్పేట, మూడు చింతలపల్లి మండలాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు

తిరువనంతపురం: కేరళలోని శబరిమలకు భక్తులు పోటెత్తారు. అయ్యప్పస్వామి దర్శనాలు తెల్లవారుజాము నుంచి ప్రారంభం కావడంతో భక్తులు ఆలయానికి క్యూకట్టారు. పవిత్రమైన మలయాళ మాసం వృచికం మొదటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు పుజారులు ఆలయ తెలుపులు తెరిచారు. రెండు నెలల పాటు దర్శనాలు కొనసాగనున్నాయి. దీంతో అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది యాత్రికులు, భక్తులు శబరికి తరలివస్తున్నారు. ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రతి ఏడాది దక్షిణ భారతదేశం నుంచి వచ్చే భక్తులతోనే శబరిమల యాత్ర ప్రారంభమవుతుంది.

# 1978లో అత్యధికం.. 2009లో అత్యల్పం

బోధన్ : ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమైందే. ఒక్కోసారి ఒక్క ఓటే గెలుపోటములను నిర్ణయిస్తుంది. అందుకే నియోజకవర్గంలోని ఓటర్లందరూ తననే ఆదరించాలని పోటీ చేసే అభ్యర్థులు ఆశిస్తారు. కానీ పోలైన అన్ని ఓట్లలో.. ఒకరికి కొంత ఎక్కువ పోలవుతాయి. ఆ ఓట్ల ఆధిక్యమే అతనిని విజేతగా నిలుపుతుంది. అలా బోధన్ నియోజకవర్గానికి జరిగిన పదిహేను శాసనసభ ఎన్నికల్లో రెండు ఫలితాలు ప్రత్యేకంగా నిలిచాయి. అందులో ఒకటి 1978లో అత్యధికంగా సాధించిన మెజారిటీ కాగా 2009లో అత్యల్ప ఆధిక్యం నమోదైంది.

వివరాలు ఇలా :1978లో జరిగిన ఎన్నికల్లో మొత్తం ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వారిలో ముగ్గురికి ధరావతు గల్లంతైంది. మిగిలిన ముగ్గురిలో మొదటి స్థానంలో నిలిచిన కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి గులాం సందాని 34,526 ఓట్లు సాధించారు. ద్వితీయ స్థానంలో



నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరెడ్డికి 11,440 ఓట్లు లభించాయి. గెలిచిన అభ్యర్థి ఓడిన వ్యక్తిపై 23,086 ఓట్లు ఎక్కువగా పొందారు. ఆధిక్యం శాతంలో చూస్తే 36.25 శాతంగా నమోదైంది. అంత ఆధిక్యం ఎప్పుడూ నమోదు కాలేదు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చీలిక వచ్చి గులాం సందాని కాంగ్రెస్(ఐ) తరఫున పోటీ చేసినట్లు చెబుతారు. ప్రచారానికి దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బోధన్‌కు వచ్చారు. అత్యల్ప మెజార్టీతో బయటపడిన ఎన్నికగా 2009 నిలిచింది. ఈ ఎన్నికల్లో మొత్తం ఏడుగురు బరిలో నిలిచారు. అందులో నలుగురు తమ ధరావతు కోల్పోయారు. వారిలో విజేతగా నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి 42,494 ఓట్లు పోలయ్యాయి. ద్వితీయ స్థానంలో నిలిచిన తెరాస అభ్యర్థి షకీల్ 41,219 ఓట్లు సాధించారు. ఆధిక్యం 1,275 ఓట్లు కాగా శాతంలో చూస్తే 0.97 శాతంగా నమోదైంది.

# పారదర్శకతకు పెద్దపీట

సిద్దిపేట: శతశాతం పోలింగ్.. పారదర్శక ఓటింగ్.. ఎన్నికల క్రతువులో ఈ రెండు అత్యంత కీలకం. అధికారులు పక్కాగా తమ బాధ్యతలు నిర్వర్తించినపుడే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుంది. ఈ తరుణంలో ఎన్నికల సంఘం ప్రజల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఉల్లంఘనులకు ముకుతాడు వేసేందుకు వివిధ విభాగాలను అందుబాటులోకి తెచ్చింది. ఉల్లంఘనలకు పాల్పడే వారిని ఎప్పటికప్పుడు కట్టడి చేయడమే లక్ష్యంగా పలు రకాల చర్యలు చేపట్టింది.గత నెల 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కోడ్ అమలులోకి రాగా పలుచోట్ల అధికారులు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 30న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే నామినేషన్ల పరిశీలన పూర్తయింది. అభ్యర్థులు ఎవరనేది కొలిక్కి రానుంది. ఇక ప్రచారం మరింతగా ఊపందుకోనుంది. ఇటువంటి సమయంలో బరిలో నిలిచే కొందరు.. ప్రలోభాల పర్వానికి తెరలేపే అవకాశం లేకపోలేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. సమస్యలు, సందేహాలను తీర్చేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.సందేహం లేకుండా..కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నం. 1950 ద్వారా ఇప్పటి వరకు 1402 కాల్స్ స్వీకరించారు. ప్రధానంగా సందేహాల నివృత్తికి ఇది దోహదం చేస్తోంది. నూతన ఓటరు నమోదు, సవరణ, కార్డు పొందడం, జాబితాలో ఉన్నామా.. లేదా..? అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని టెస్టు కాల్స్ కూడా జాబితాలో ఉంటున్నాయి. జిల్లాలో అత్యధికంగా నూతన ఓటరు నమోదుకు సంబంధించి 579 మంది సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఈ విభాగం నిరంతరాయంగా పని చేస్తోంది. ఈ విభాగానికి ఇప్పటి వరకు గరిష్ఠంగా సిద్దిపేట, కనిష్ఠంగా హుస్నాబాద్ నుంచి కాల్స్ అందాయి.ఆదాయ పన్ను శాఖ నంబర్లు..సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా సొత్తు వినియోగం జరిగితే రాష్ట్ర ఆదాయ పన్ను శాఖకు ఫిర్యాదు చేయొచ్చు. ఈ మేరకు ఆ శాఖ టోల్ ఫ్రీ నం. 1800 425 1788 సంప్రదించవచ్చు. ఇదే క్రమంలో



వాట్సాప్ నం. 70137 11399 అందుబాటులోకి తెచ్చారు. ఈ కంట్రోల్ రూం నిరంతరాయంగా పని చేస్తుంది. కలెక్టరేట్‌లో ఈ విభాగం గోడపత్రిక ప్రదర్శిస్తున్నారు.వెబ్‌సైట్ ఉందని తెలుసా... ఎన్‌జీఆర్ఎస్ (నేషనల్ గ్రివెన్స్ రిడ్రెస్సల్ సిస్టం).. ఇదో వెబ్‌సైట్. జాతీయస్థాయిలో ఈ ఆన్‌లైన్ వ్యవస్థ పని చేస్తుంది. నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఎక్కడి నుంచయినా ఫిర్యాదు చేయొచ్చు. వెబ్‌సైట్‌లో రాత పూర్వకంగా, ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఇప్పటి వరకు అలా జిల్లాకు సంబంధించి మొత్తం 539 ఫిర్యాదులు అందాయి. జిల్లాకు సంబంధించి సదరు విభాగాన్ని కలెక్టరేట్‌లో అందుబాటులోకి తెచ్చారు. వచ్చిన ఫిర్యాదులను ఇక్కడి సిబ్బంది నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులకు చేరవేస్తారు. అనుగుణంగా పరిష్కరించి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. సిద్దిపేట నుంచి ఎక్కువగా, దుబ్బాక నుంచి తక్కువగా ఫిర్యాదులు అందినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.మనమూ విజిల్ వేయొచ్చు..ఉల్లంఘనుల కట్టడిలో సీ-విజిల్ పాత్ర కీలకంగా మారింది. ఈ యాప్ ద్వారా అందించే ఫిర్యాదులపై ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు చేపడతారు. 100 నిమిషాల్లో పరిష్కరించేలా చొరవ చూపుతారు. అప్పటికప్పుడు సదరు ఆధారాలు (చిత్రాన్ని బంధించి) పోస్టు చేయడం ద్వారా స్పందిస్తారు. ఇది నిరంతరాయంగా పని చేస్తుంది. ఇప్పటి వరకు మొత్తం 145 ఫిర్యాదు అందాయి. అందులో 100 నిమిషాల వ్యవధిలో 94 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. ఫిర్యాదులు చేయడంలో సిద్దిపేట నియోజకవర్గం మొదటి వరుసలో నిలిచింది.

# అన్నా.. అప్పు తీర్చరాదే..!



నాంపల్లి : ఎన్నికల ప్రచారంలోకి పూర్తి స్థాయిలో దిగేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కింది స్థాయి నేతల డిమాండ్లు విని తల బొప్పికడుతోంది. రోజు వారీ ఖర్చులు.. ఉదయం, సాయంత్రం అన్నీ చూసుకుంటామని హామీ ఇస్తున్నా.. 'ఇంకాస్త' కావాలంటూ మనసులో మాట చెబుతున్నారు. చిన్న పాటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, కొంత సర్దుబాటు చేయాలని కొందరు అడిగితే.. అప్పులతో సతమతమవుతున్నామని ఆదుకోవాలని ఇంకొందరు కోరుతున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఓ ప్రధాన పార్టీ అభ్యర్థితో గ్రామీణ నాయకుడు తనకు రూ.3 లక్షల అప్పు ఉందని.. కాస్త 'సర్దుబాటు' చేస్తే మీరు ఏ పార్టీ మారినా మీ వెంటే ఉంటానంటూ కోరాడు. ఒక్కరికే ఈ స్థాయిలో ముట్టజెబితే నియోజకవర్గమంతా ఎంత ఖర్చు చేయాల్సి వస్తుందోనని సదరు అభ్యర్థి సన్నిహితుల వద్ద వాపోయాడు.

**ప్రచారానికి వస్తే.. మా పనులెలా..!**

అభ్యర్థులకు ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లో ప్రతి ఒక్కర్నీ పేర్లతో పరిచయం చేసే ముఖ్య కార్యకర్తలు ఎంతో ముఖ్యం. ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో అభ్యర్థులకు పెద్దగా ఇబ్బంది లేకపోయినా కార్యకర్తలు, బూత్ స్థాయి నేతలతో ఇబ్బంది వచ్చిపడుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు కింది స్థాయి నేతల్ని మచ్చిక చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువగా చిరు వ్యాపారులు, మధ్య తరగతి కుంటుంబాలకు చెందిన వారే కావడంతో పనులన్నీ మానుకొని ప్రచారానికి వస్తే ఇబ్బంది అవుతుందని తెగేసి చెబుతున్నారు. దీంతో అభ్యర్థులు అప్పటికప్పుడు ఎంతోకొంత ముట్టజెప్పి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఖర్చుకు వెరవనీయని.. కళ్ల ముందు ఎమ్మెల్యే కుర్చీ..

కిందిస్థాయి నేతల్ని బుజ్జగించడం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. ఎన్నికలకు ముందు పార్టీ మారిన వారు ఇరకాటంలో పడుతున్నారు. పార్టీ మారగానే అప్పటిదాకా తమ వెన్నంటే ఉన్నవారు ప్రత్యర్థులు అవుతుండగా, ఇన్నాళ్లు ప్రత్యర్థులుగా ఉన్న వారు వెంట ఉంటున్నారు. 'కళ్ల ముందు ఎమ్మెల్యే కుర్చీ'.. కదలాడుతుంటే.. ఇన్నాళ్లు కొనసాగిన వైరాన్ని మర్చిపోవాలంటూ ఆప్యాయంగా మాట్లాడుతూ ఎంతోకొంత ముట్టజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. చోటామోటా నేతలను తమవైపు తిప్పుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేక వాహనాలు.. ఖర్చులకు నగదు ఇస్తూనే.. పూర్తి స్థాయిలో ప్రచారానికి దిగకముందే సొంత నేతల్ని వెంట తిప్పుకోవడానికి రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోందని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

# పట్టణ ఓటర్లు కదిలితేనే.. ఓటుకు పట్టం



కనగల్ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ప్రత్యేక విలువ ఉంటుంది. సక్రమంగా వినియోగించుకుంటేనే దేశభవిష్యత్తు, అభివృద్ధిని నిర్ణయించిన వారమవుతాం. అయితే.. ఓటరుగా నమోదు చేసుకోవడంలో చూపిస్తున్న ఉత్సాహం ఓటు హక్కు వినియోగంలో చూపడం లేదు. ముఖ్యంగా పట్టణ ఓటర్లు దూరంగా ఉంటున్నారు. నల్గొండ నియోజకవర్గాన్ని పరిశీలిస్తే 2014లో అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అప్పుడు పోలింగ్ 73.27 శాతం నమోదు కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 84.13 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 62.19 శాతానికి పడిపోయింది. మరీ తక్కువగా నల్గొండ పట్టణంలోని పబ్లిక్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో 42.20 శాతం, 2018 శాసన సభ ఎన్నికలో శ్రీనగర్ కాలనీలో 102 పోలింగ్ కేంద్రంలో 52.32 శాతం పోలింగ్ కావడం గమనార్హం.

జిల్లా కేంద్రంలోనే తక్కువ శాతం..2018 అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే నల్గొండ నియోజకవర్గంలో కనగల్, తిప్పర్తి, నల్గొండ రూరల్, నల్గొండ పురపాలిక, మాడ్గులపల్లి (ఐదుగ్రామాలు)లలో 279 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. మొత్తం కేంద్రాల్లో సరాసరి 84.13 శాతం పోలింగ్ నమోదైంది. అందులో పురపాలికలోని పోలింగ్ కేంద్రాల్లో మరీ తక్కువగా 79 శాతంలోపే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతానికి పైగా నమోదయింది.

2018లో నియోజకవర్గంలో మొత్తం 2,16,807 ఓట్లున్నాయి. వీటిలో 1,82,389 పోలయ్యాయి. కనగల్‌లో 32,279 ఓట్లకు 30,367 పోలవగా.. తిప్పర్తిలో 31,544కు 29,045 ఓట్లు, నల్గొండ మండలంలో 34,592 ఓట్లకు 32,147, మాడ్గులపల్లి 6,908 ఓట్లకు 6,364 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. నల్గొండ పురపాలికలోని 1,12,028 ఓట్లకు గానూ 89,460 మంది ఓటు వినియోగించుకోగా.. 22,568 మంది దూరంగా ఉన్నారు. నాలుగు మండలాల్లో మొత్తం ఓటర్లు 1,04,779 మందికి 92,928 మంది ఓటు హక్కు వినియోగించుకోగా (11,851 మంది దూరం), పురపాలికలో 1,12,028 మంది ఓట్లకు కేవలం 89,460 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. 22,568 మంది దూరంగా ఉన్నారు.

గ్రామీణ ప్రాంతంలోని ఓటర్లు ఓటుహక్కు సరిగానే వినియోగించుకుంటున్నా పట్టణ ప్రాంత ఓటర్లు నిర్లక్ష్యం చేస్తూ పోలింగ్‌కు దూరమవుతున్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. పట్టణంలో ఉండేవారు ఎక్కువశాతం విద్యావంతులే. ఓటుహక్కు వినియోగం, కలిగే లాభాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన ఉంటుంది. అలాంటి విద్యావంతులే పోలింగ్‌కు దూరంగా ఉండటం విచారకరంసామాన్యుడి వజ్రాయుధం..ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు సామాన్యుడి చేతిలో ఒక వజ్రాయుధం లాంటిది. సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉంది. పోలింగ్ రోజు అనగానే ఒక సెలవురోజుగానే చూడకుండా మన భవిష్యత్తును నిర్ణయించే రోజు అని, మన భవిష్యత్తు తరాలకు మంచి బాటలు వేస్తున్నామనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఓటు వినియోగంలో వృద్ధులను చూసి నేర్చుకోవాల్సి ఉంది. ఓటు హక్కు వినియోగించుకోకుంటే తాము మరణించిన వారితో సమానమని భావించి తమ ఓటును వినియోగించుకుంటారు.

# దుమ్ము లేపుతున్న దుబ్బాక

చేగుంట : దుబ్బాక రాజకీయం రసవత్తరంగా మారింది. ప్రధాన పార్టీలైన భారాస, భాజపా, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు నువ్వా నేనా అనే విధంగా తలపడుతున్నాయి. ఎవరికి వారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి దుబ్బాకపైనే ఉంది. దీనికి కారణం ఇక్కడ భాజపా సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, భారాస నుంచి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బరిలో నిలిచారు. తీవ్ర ఉత్కంఠ తరువాత కాంగ్రెస్ అధిష్ఠానం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. దీనివల్ల గెలుపుపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. మూడు పార్టీలు సైతం నువ్వానేనా అనే విధంగా ప్రచారం చేస్తుండటంతో అందరి దృష్టి దుబ్బాకపై పడింది.

ఎక్కుపెడుతున్న విమర్శనాస్త్రాలు

మొదటి నుంచి దుబ్బాక రాజకీయం ఆసక్తిగా ఉంది. 2020 ఉప ఎన్నికల నుంచి మరీ ఎక్కువైంది. దానికి కారణం భారాసకు కంచుకోట అయిన దుబ్బాక నియోజకవర్గంలో భాజపా పాగా వేసింది. ఆ పార్టీకి చెందిన మాధవనేని రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి అందరి చూపు ఇక్కడే ఉంది. అభివృద్ధి విషయంలో రెండు పార్టీలకు వైరుధ్యం ఉంటూ వస్తోంది. ఇరు పార్టీల నేతల మధ్య తరచూ విమర్శలు కొనసాగుతున్నాయి. పథకాల మంజూరు విషయంలో ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఎంపీగా ఉండి ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని భాజపా అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శిస్తున్నారు. మూడేళ్లు రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా ఉండి చేసింది ఏమీలేదని, నియోజకవర్గం మూడేళ్లు వెనకబడి పోయిందని భారాస అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి ప్రచారంలో పేర్కొంటూ వచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో చేసింది శూన్యమని కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి విమర్శిస్తున్నారు.

చేరికలపై దృష్టి

నియోజకవర్గంలో రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. చేగుంట, దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట నార్సింగి, రాయపోల్, మాసాయిపేట, అగ్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో మూడు ప్రధాన పార్టీల ప్రచారం ఊపందుకుంది. భాజపా అభ్యర్థి గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. భారాస అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగిన తర్వాత ప్రచారంలో కొంత జాప్యం వచ్చింది. ఆయన తరఫున కుమారుడు పృథ్వీరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్‌లు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి సైతం ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గంలో శ్రీనివాస్‌రెడ్డి 110 రోజులు ఆత్మగౌరవయాత్ర నిర్వహించారు. దానివల్ల ఒకసారి ప్రచారం కూడా పూర్తి చేసుకోవటం తమకు కలిసి వస్తుందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. మరోవైపు మూడు పార్టీలు కూడా చేరికలపై దృష్టి పెట్టారు.

అనుచరగణంతో ప్రచారం

గ్రామాల్లో మూడు పార్టీల అభ్యర్థులు తమ అనుచరగణంతో ముమ్మరంగా ప్రచారం చేసుకుంటున్నారు. మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇందులో ఉంటున్నారు. వారితో పాటు గ్రామంలో ఉండే మహిళలతో బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. తమ బలం ప్రదర్శనకు ప్రయత్నం చేస్తున్నారు. మూడు పార్టీలు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

# కార్మిక ఓటే.. గెలుపు బాట

మంచిర్యాల : సింగరేణి ప్రాంతం తెలంగాణ కొంగుబంగారం.. రాబోయే ఎన్నికల్లో కార్మికుల ఓట్లే కీలకం. మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాలతోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఒక నియోజకవర్గంలో వారితోపాటు కార్మికుల కుటుంబసభ్యుల ఓట్లు పొందే అభ్యర్థులే గెలుపుబాటలో పయనిస్తారు.

కార్మిక నాడి పట్టుకుంటేనే..రెండు జిల్లాల్లో సింగరేణి విస్తరించిన బెల్లంపల్లి రీజియన్‌లో సుమారు 17వేల మంది శాశ్వత కార్మికులు, సుమారు 8500 మంది ఒప్పంద, పొరుగు సేవల కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఆయా కుటుంబాల్లో ఒక్కో ఇంట్లో సగటున నాలుగు ఓట్ల చొప్పున పార్టీలు అంచనా వేస్తున్నాయి. దీని ప్రకారం నాలుగు నియోజకవర్గాల్లో సుమారు లక్షకు పైగా ఓట్లు కీలకంగా మారనున్నాయి. వీరితోపాటు విశ్రాంత కార్మికులు, వారి కుటుంబీకుల ఓట్లు మరో పది వేల వరకు ఉండే అవకాశముంది. ఇప్పటికే ఈ నియోజకవర్గాల్లో ఉండే కార్మికులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించేందుకు నేతలు, పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యారు. కార్మిక సంఘాల నేతలను తిప్పుకొనేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాయిలాలు వారిని ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

గుర్తింపు ఎన్నికలపై ప్రభావం

సింగరేణిలోని కార్మిక సంఘాలు ప్రధాన పార్టీలకు అనుబంధ సంఘాలే. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు సంఘం ఎన్నికలను హైకోర్టు వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు.. డిసెంబరు చివరి వారంలో నిర్వహించే గుర్తింపు ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే టికెట్లు పొందిన అభ్యర్థులు, ఆశావహులు అనుబంధ కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలతో సమావేశమై వారిని ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. సింగరేణిలో పనిచేసే ఉద్యోగులకు గతంలో వేతనాలు ఇచ్చిన వెంటనే కార్మికులు మద్యం తాగి రోడ్లపై ఎక్కడపడితే అక్కడే పడిపోయేవారు. అప్పుడు వారి కుటుంబాలు ఆర్థిక సమస్యలతో ఇబ్బందుల్లో పడేవారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యపానంపై నిషేధం విధించడం, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం సింగరేణి కార్మికులకు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించడంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం మొదలైంది. గతంలో సింగరేణి జీఎం స్థాయి అధికారుల పిల్లలు విదేశాల్లో చదవితే, ఇప్పుడు సాధారణ కార్మికుల పిల్లలు అనేక మంది విదేశాల్లో చదువుతూ, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. సింగరేణి భూగర్భ గనులు, ఉపరితల గనులే కాకుండా నియోజక వర్గం చుట్టూ విద్యుత్తు, ఉత్పత్తి కేంద్ర,ం, సిమెంట్, సిరామిక్స్ పరిశ్రమలు విస్తరించి ఉండటంతో మంచిర్యాల పట్టణం వ్యాపార కేంద్రంగా మారింది. కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర, బెంగాల్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి బతుకు దేరువు కోసం వచ్చిన వలసవాదులు ఇక్కడే వివిధ వ్యాపారాలు చేస్తూ స్థిరపడిపోయారు. ఈ నియోజక వర్గం గ్రామాల నుంచి ఎదిగిన రాజకీయ అగ్రనేతలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవులు పొందిన చరిత్ర ఉంది.మంచిర్యాల నియోజకవర్గంలో నాడు సమస్యాత్మకంగా మారిన శ్రీరాంపూర్ సింగరేణి ప్రాంతం.. ఇప్పుడు కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. 1996లో సీసీసీలో జరిగిన సికాస జిల్లా కార్యదర్శి రమాకాంత్ ఎన్‌కౌంటర్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మావోయిస్టులపై ఉక్కుపాదం మోపాయి.

# విద్యార్థిలా ఆలోచిస్తే విజేతలమే..

దండేపల్లి : అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు, విద్యార్థులకు ఏటా నిర్వహించే పరీక్షలు రెండూ ఒకలాంటివే.. విద్యాలయాల్లో ఉపాధ్యాయులు ఏడాదంతా పాఠాలు బోధిస్తే వాటిని చదివి చివరగా విద్యార్థులు పరీక్షల్లో సమాధానాలు రాస్తారు. వీటిలో వచ్చే మార్కులే విద్యార్థుల భవితకు బాటలు వేస్తాయి. ఎన్నికల తీరులోనూ ఇదే ఒరవడి ఉంటుంది. సాధారణంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడానికి విద్యావేత్తలు ఒక మార్గాన్ని సూచిస్తుంటారు. చదవడం, అవగాహన పెంచుకోవడం (అర్థం చేసుకోవడం), నమోదు చేసుకోవడం, సమీక్షించుకోవడం, మూల్యాంకనం అనే ఈ అంశాలు చూపెడుతుంటారు. విద్యార్థుల కోసం వీటిని ఏవిధంగానైతే సూచిస్తున్నామో.. తాము, తమ పిల్లల భవిష్యత్తు కోసం కూడా ఓటర్లు ఈ సూత్రాన్ని అనుసరిస్తే బాగుంటుంది.

సమాచార సేకరణ ముందుగా ఉపాధ్యాయుడు పాఠం చెబుతుంటే విద్యార్థులు ఆ పాఠాలు శ్రద్ధగా వింటారు. ఎన్నికల్లో అభ్యర్థులు చెప్పే విషయాన్ని ఓటర్లు శ్రద్ధగా వినాల్సిందే. ఒక విద్యార్థి పాఠంలోని అన్ని అంశాల గురించి తెలుసుకున్నట్లే... అభ్యర్థుల గురించి ముందుగా పూర్తిగా తెలుసుకోవాలి. ప్రచార సామగ్రి, టీవీలు, పత్రికలు, ప్రసంగాల ద్వారా తెలుసుకోవాలి. గతంలో ఆయన ప్రజలకు చేసిన సేవ, ప్రవర్తన, ప్రజలకు ఏమేర అందుబాటులో ఉంటారు. ప్రజలకు సేవ చేయగలుగుతారా అని నిర్ధారణ చేసుకోవాలి. నాయకుడి నిజాయతీ, నిష్పక్షపాతం, నిలకడైన నిర్ణయాలు తదితర లక్షణాలను గుర్తించాలి. స్పందించాలి.. అవగాహన పెంచుకోవాలిపోటీ చేసుకున్న అభ్యర్థులపై ప్రజలు ఏమనుకుంటున్నారో అంచనా వేయాలి. ఒక్కోసారి మన అభిప్రాయాలను వారు ప్రభావితం చేస్తారు. అభ్యర్థులు ఎలాంటి హామీలు ఇస్తున్నారు. మనను ప్రభావితం చేసేందుకు వారు ఏమి చేస్తున్నారు. వీరు చెప్పిన వాటిని పాటిస్తారా... లేదా ఇప్పటి వరకే ఉంటాయా అనే దానిపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకు అవసరమైతే తోటి వారితోనూ చర్చించాలి.

నమోదు చేసుకోవాలి ఇప్పటి వరకు అభ్యర్థి చెప్పినవన్నీ విన్నాం.. వీటిపై ఒక అవగాహనకు వచ్చాం. విద్యార్థులు తమ నోట్ పుస్తకాల్లో అన్ని విషయాలు సమగ్రంగా నమోదు చేసుకుంటే ఓటర్లు మనసులోనే వీటిని నమోదు చేసుకోవాలి. బరిలో నిలిచిన అభ్యర్థులపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. వారు ఇస్తున్న హామీలు ఏవిధంగా అమలు చేస్తారో చూసుకోవాలి. అభ్యర్థి గుణగణాలు, ఆయన ప్రజలకు సేవ చేయగలుగుతాడా లేదా అనే విషయంపై ఆలోచించాలి.

మూల్యాంకనం.. ఓటేయడం

సరిగ్గా కీలకమైన మెట్టు ఇదే.. సేకరించిన సమాచారం, తెలుసుకున్న అంశాలు, గుర్తించిన లక్షణాలు వీటన్నింటిని చూసుకుని ఆ తర్వాత ఏ అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలో నిర్ణయించుకోవాలి. ఏడాదంతా కష్టపడి చదివిన విద్యార్థి పరీక్షలో సమాధానాలు రాసినట్లు చివరికి మన భవిష్యత్తుకు ఎవరికి ఓటేస్తే బాగుంటుందో నిర్ణయం తీసుకోవాలి. అభ్యర్థుల గురించి సేకరించుకున్న సామర్థ్యాన్ని, గుణగణాలను క్రోడీకరించుకోవాలి. అందులో వారి బలాలు, బలహీనతలను నమోదు చేసుకోవాలి. ఇలా అందరి వివరాలు నమోదు చేసుకుని బేరీజు వేసుకుంటే ఎవరు బాగా పని చేస్తారో తెలుసుకుని వారికే ఓటేయాలి.

సమీక్షించుకోవాలి

# పోలింగ్ కేంద్రం లేని పంచాయతీ

జయశంకర్ :ఆ గ్రామం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉంది. ఇక్కడ మొత్తం ఓటర్లు 936 ఉన్నారు. అయినా పోలింగ్ కేంద్రం లేదు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావి గ్రామం గతంలో కొంత మందపల్లి పంచాయతీ, మరికొంత తొగర్రాయి పంచాయతీ పరిధిలో ఉండేది. 2018లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. గతంలో కూడా ఇక్కడ పోలింగ్ కేంద్రం లేదు. ఓటర్లకు అందుబాటులో ఉండే విధంగా రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు గిర్నిబావిలో మాత్రం ఎందుకు ఏర్పాటు చేయడం లేదో గ్రామస్థులకు అర్థం కావడం లేదు. ఇక్కడి 936 మంది ఓటర్లలో.. నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారికి ఒకవైపు ఇళ్లున్న 600 ఓటర్లను 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందపల్లి పోలింగ్ కేంద్రానికి, మరోవైపు ఇళ్లున్న 336 మంది ఓటర్లను ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని తొగర్రాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. 2018లో కొత్తపంచాయతీగా ఏర్పడ్డాక స్థానిక సంస్థల పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇక్కడే పోలింగ్ కేంద్రాలు పెట్టారు. శాసనసభ ఎన్నికలకు మాత్రం ఇక్కడి ఓటర్లు ఇతర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేయాల్సి వస్తోంది.

ఒకే మండలం... రెండు జిల్లాలు!హుజూరాబాద్ నియోజకవర్గంలో కమలాపూర్, జమ్మికుంట, వీణవంక, హుజూరాబాద్, ఇల్లంతకుంట మండలాలున్నాయి. వీటిలో కమలాపూర్ తప్ప మిగిలినవన్నీ కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. కమలాపూర్ మండలం మాత్రం




హనుమకొండ జిల్లాలో ఉంది. రాజకీయపరంగా కూడా ఈ మండలం అత్యంత కీలకమైంది. దీనితో రెండు జిల్లాల అధికారులు ఈ మండలం ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు మండలంగా ఉన్న కమలాపూర్ 1962–2004 మధ్యకాలంలో నియోజకవర్గంగా ఉండేది. తరువాత పునర్విభజనలో హుజూరాబాద్ నియోజకవర్గంలో కలిపారు. ఈ నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యే కేవీ. నారాయణరెడ్డి. 2004లో చివరి సారి ఈటల రాజేందర్ గెలుపొందారు.

నిస్వార్థ నాయకుడికే నా ప్రాధాన్యం

నా పేరు కోయ రేవంత్. బీటెక్ (ఈఈఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. నర్సంపేట పట్టణం 22వ వార్డు మాది. ఈఏడాది ఓటు హక్కు వచ్చింది. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. ఎప్పుడెప్పుడు ఓటు వేద్దామనే ఆత్రుతగా ఉంది. ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా వినియోగించుకుంటా. దేశానికి విలువైన సంపద యువతలను వారి శ్రేయస్సును నిర్లక్ష్యం చేస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించే నాయకుడు, పేదల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే నీతిమంతుడు, నిజాయితీపరుడికి నా తొలి ఓటు వేస్తాను.

ఎన్నికలు ఎప్పుడు రద్దు చేస్తారంటే..ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 58ఏ ప్రకారం పోలింగ్ జరుగుతున్నప్పుడు, ఓట్ల లెక్కింపు సమయంలో బూత్ క్యాప్చరింగ్ జరిగినా, డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పార్టీలు, అభ్యర్థులు ప్రయత్నించినా.. ఆ ఎన్నికలను రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంది. ఏదైనా ఎన్నికను రద్దు చేయాలనుకున్నప్పుడు రాజ్యాంగంలోని 324 అధికరణ, జనరల్ క్లాజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 21 ప్రకారం.. రాష్ట్రపతికి ఎన్నికల సంఘం సిఫార్సు చేస్తుంది. ఆ సిఫార్సును రాష్ట్రపతి పరిశీలించి ఆమోదిస్తే.. ఆ ఎన్నిక రద్దవుతుంది.

తమిళనాడులో మూడుసార్లు..2016లో తమిళనాడు శాసనసభ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు పంచుతున్నారనే కారణంతో అరవకురిచి, తంజావూరు నియోజకవర్గాల్లో ఎన్నికలను ఎన్నికల సంఘం రద్దుచేసింది.

అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం 2017లో ఆర్కేనగర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నారని ఆ ఎన్నికను భారత ఎన్నికల సంఘం రద్దు చేసింది. 2019లో తమిళనాడులోని వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆ ఎన్నికను ఈసీ రద్దుచేసింది. డబ్బు పంపిణీ కారణంగా దేశంలో రద్దైన తొలి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నిక ఇదే.

## పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులుండవ్!

హైదరాబాద్: గుర్తులు లేకుండా ఎన్నికలేంటనేగా మీ సందేహం.. అవును.. పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు..కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఇతర ప్రత్యేక వ్యక్తులు వేసే ఓటే 'పోస్టల్ బ్యాలెట్'. ఇంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగినప్పుడు మామూలు ఓటర్లకిచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకూ ఇచ్చేవారు. ఈవీఎం యంత్రాలు రావడంతో, వారికి యంత్రంలో ఓటేసే పరిస్థితి లేదు. పోస్టల్ బ్యాలెట్‌ను తీసుకొచ్చారు. ఇందులో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

ఆ ఎమ్మెల్యే పదవీకాలం మూడు నెలలే

ఒకసారి ఎమ్మెల్యేగా గెలిస్తే ఎంత కాలం ఆ పదవిలో కొనసాగుతారు. అయిదేళ్లు.. ఉప ఎన్నికల్లో గెలిచినా ఐంచుమించు ఏడాదైనా ఉంటారు. కానీ కార్వాన్ నుంచి గెలిచిన ఓ ఎమ్మెల్యే.. కేవలం మూడు నెలలు మాత్రమే పదవిలో కొనసాగారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ తరఫున సయ్యద్ సజ్జాద్ గెలుపొందారు. ఆయన 2003లో మరణించారు. అక్కడ ఉప ఎన్నికలు వచ్చాయి. మజ్లిస్ నుంచి బరిలో నిలిచిన అఫ్జర్‌ఖాన్ విజయం సాధించారు. తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యానన్న సంతోషం ఆయనకు ఎంతోకాలం నిలవలేదు. అనంతరం మూడు నెలల్లోనే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు అసెంబ్లీని రద్దు చేశారు. అలా అఫ్జర్‌ఖాన్ తక్కువ కాలం కొనసాగిన ఎమ్మెల్యేగా రికార్డుల్లోకి ఎక్కాడు. ఆయన తర్వాత జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

# శాసన పోరు.. యువ జోరు



హైదరాబాద్: రాజధానిలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. రాజకీయ నేతల పరస్పర ఆరోపణలతో ఎన్నికలపై ప్రజల్లో వాడివేడిగా చర్చ జరుగుతోంది. ఈనెల 30న జరగనున్న ఓట్ల పండగ కోసం తొలి ఓటర్లు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతను ఆకట్టుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేస్తోంది. ప్రతి నియోజకవర్గంలో.. పూర్తిగా యువతతో నడిచే ఓ పోలింగ్ కేంద్రం సిద్ధమవుతోంది. ప్రజాస్వామ్య పోరులో పాల్గొనేందుకు దక్కిన తొలి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పాతబస్తీ ముందంజ..తొలి ఓటర్లతో పాటు అన్ని వయసుల వారి ఓటర్ల నమోదు, తొలగింపు.. ఇలా అన్ని అంశాల్లోనూ.. పాతబస్తీలోని పలు నియోజకవర్గాలు ముందు వరుసలో ఉన్నాయి. అక్టోబరు 4-30 మధ్య జీహెచ్‌ఎంసీకి వచ్చిన ఓటరు దరఖాస్తులు, బల్దియా అధికారులు ఇంటింటి సర్వే ద్వారా నమోదు చేసుకున్న కొత్త, రద్దయిన ఓటర్ల సంఖ్య ఆ విషయాన్ని స్పష్టం చేస్తోంది. 18-19 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు కార్వాన్ నియోజకవర్గంలో అత్యధికంగా 7,608 మంది జాబితాలో చేరారు. జూబ్లీహిల్స్, నాంపల్లి, మలక్‌పేట, అంబర్‌పేట, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర, యాఖుత్‌పుర నియోజకవర్గాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కంటోన్మెంట్ నియోజకవర్గంలో యువ ఓటర్లు కేవలం 2వేలు మాత్రమే కావడం గమనార్హం.నకిలీ ఓట్లు, మృతుల ఓట్ల తొలగింపులో కూడా పాతబస్తీ ముందుంది. గరిష్ఠంగా చాంద్రాయణగుట్టలో 27,295, కార్వాన్ 7,406, యాఖుత్‌పుర 5,763, ఖైరతాబాద్ 5,739, జూబ్లీహిల్స్‌లో 5,734 చొప్పున ఓట్ల రద్దు జరిగింది. నెలలో 85వేల ఓట్లను హైదరాబాద్ జిల్లా అధికారులు రద్దు చేశారు.

నెల రోజుల్లో కొత్తగా జాబితాలో చేరిన ఓటర్ల సంఖ్య కూడా పాతబస్తీ నియోజకవర్గాల్లో అత్యధికంగా ఉంది. చాంద్రాయణగుట్టలో 36,817, నాంపల్లి 17,174, జూబ్లీహిల్స్ 15,569, కార్వాన్ 13,004, ఖైరతాబాద్ 12,195, యాకుత్‌పుర 11,266, బహదూర్‌పుర 9,755, అంబర్‌పేట 9,753, ముషీరాబాద్ 9,409, మలక్‌పేట 8,742, సికింద్రాబాద్ 8,716, కంటోన్మెంట్ 7,797, సనత్‌నగర్ 7,433, చార్మినార్ 6,036, గోషామహల్‌లో 5,713 మంది చొప్పున ఇటీవల ఓటర్లయ్యారు.

# అక్కడ జై కొట్టి.. ఇక్కడ క్యూ కట్టి

హైదరాబాద్: మహిళలు సొంత పనిమీద ఎక్కడికో వెళుతున్నారు అనుకుంటున్నారా.. ఇదే మరి మన రాజకీయ నాయకుల గిమ్మిక్కు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రచార వ్యయం పరిమితి నామినేషన్ వేసే నాటికే మించి పోతుండటంతో ఎక్కడ కూడిక వేయాలో ఎక్కడ తీసివేత వేయాలో అలోచించి మరీ అడుగు ముందుకు వేస్తున్నారిలా.. సికింద్రాబాద్ మాణికేశ్వరినగర్‌లో ఓ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలకు భోజనం ఏర్పాట్లు చేస్తే ఎన్నికల పరిశీలకులు ఎటు నుంచి వచ్చి తన ఖాతాలో వేస్తారో అన్న భయంతో ఆ అభ్యర్థి ఎక్కడో వండించిన భోజనాలు తెప్పించి సమీపంలోనే ఉన్న ఓ విద్యాసంస్థ ఆవరణలో రహస్యంగా వడ్డిస్తుండగా తినేందుకు వెళుతున్నారు వీరు.. అప్పటిదాకా చేతులు నొప్పెట్టేట్టు మోసిన జెండాలు ఒక్కటి కూడా వీరి వద్ద లేకుండా జాగ్రత్త పడటం కొసమెరుపు.

ఒకేసారి చట్టసభల్లోకి తండ్రి, ఇద్దరు కుమారులు

పాతబస్తీపై ఒవైసీ కుటుంబానిది చెరగని ముద్ర. వరుస విజయాలే కాదు.. ఒకే నియోజకవర్గాల నుంచి వరుస విజయాలు వారి సొంతం. ఒకే లోక్‌సభ నియోజకవర్గం నుంచి తండ్రి సలావుద్దీన్ ఒవైసీ.. దాని పరిధిలోని రెండు అసెంబ్లీ స్థానాల నుంచి అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ ముగ్గురూ చట్టసభల్లో అడుగుపెట్టారు. 1999 ఎన్నికల్లో ఇది జరిగింది. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. 1999 సార్వత్రిక ఎన్నికల్లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి సలావుద్దీన్ ఒవైసీ గెలిచారు. ఇదే ఎన్నికల్లో హైదరాబాద్ లోక్‌సభ పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల నుంచి అన్నదమ్ములు సలావుద్దీన్ ఒవైసీ కుమారులు అక్బరుద్దీన్, అసదుద్దీన్ గెలిచారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఈ తరహా ఘటనలు అరుదు.

ఓటు.. కనిపించని పెద్ద నోటు

2014 ఎన్నికలప్పుడు మార్కెట్‌లో ఉన్న రూ.వెయ్యి నోటు తెగ చేతులు మారింది. ఈ నోటును రిజర్వ్ బ్యాంకు రద్దు చేసింది. అనంతరం రూ.2వేల నోటు చలామణీలోకి వచ్చింది. 2018 ఎన్నికల్లో ఈ నోటు అందరి కళ్లలోనూ కాంతులు నింపింది. అభ్యర్థులు కిందిస్థాయి నాయకులు, ఓటర్లకు పెద్దఎత్తున వీటిని పంచారు. తరువాత ఈ నోటును కూడా రద్దు చేయడంతో ప్రస్తుత ఎన్నికల్లో రూ.500 మాత్రమే పెద్దనోటుగా మిగిలింది. ఎవరిని కదిలించినా మాకేమిస్తావు.. ఎంతిస్తావని నిలదీయడం సాధారణమైంది. ఇలాంటి అవసరాలకు గతంలో ఉపయోగపడ్డ పెద్దనోట్లు ఇప్పుడు కనిపించకపోవడంతో నాయకులు నిట్టూరుస్తున్నారు.

# దూరమైనా భారం అనుకోరు!



జయశంకర్ : ఎన్నికల్లో పోటీ చేసే నేతలకు ఓటర్లే దేవుళ్లు.. పాలకులను ఎన్నుకునేందుకు ఓటు ఎంతో కీలకమైనది.. కొన్నిచోట్ల ఓటు వేసేందుకు నేటికీ తిప్పలు తప్పడం లేదు. ఆవాస ప్రాంతాలకు దూరంగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఓటర్లు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటూనే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో సరైన సౌకర్యం లేకున్నా కొండలు కోనలు దాటుతున్నారు. ప్రయాణ సౌకర్యం కల్పించాలి..పోలింగ్ శాతంపై ప్రభావం పడకుండా ఉండాలన్నా, ప్రశాంతంగా పోలింగ్ జరగాలన్నా కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాలకు ఉచిత ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తే మేలు జరుగుతుంది. లేదంటే పోటీలో ఉండే అభ్యర్థులు వారిని ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటుంది. అవకాశం ఉంటే సమీపంలోని కేంద్రాలకు ఓట్లను సర్దుబాటు చేసినా ఓటర్లకు ఊరట కలుగుతుంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.ఇది ఏటూరునాగారం మండలం ఎక్కెల గ్రామంలోని పోలింగ్ కేంద్రం. ఈ 55వ నెంబరు పోలింగ్ కేంద్రంలో 603 మంది ఓటర్లున్నారు. ఎక్కెలతో పాటు ఈ గ్రామానికి కి.మీ. దూరంలోని బూటారం, 3 కిలోమీటర్ల దూరంలోని గంటలకుంట, చింతలపాడు గొత్తికోయలగూడెం, 5 కిలోమీటర్ల దూరంలోని గుండెంగవాయి నుంచి ఓటర్లు నడిచి వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది. బూటారం గ్రామంలో కేంద్రం ఏర్పాటు చేస్తే కొంతదూరభారం తగ్గుతుంది. లేదా ప్రయాణ సౌకర్యాలు కల్పించాలి.ఇక్కడ వాగులో నడుచుకుంటూ వస్తున్న వారు వాజేడు మండలం పెనుగోలు గ్రామ వాసులు. ఈ గ్రామంలో 28 మంది ఓటర్లున్నారు. వీరు ఓటు వేయాలంటే మూడు గుట్టలు, మూడు వాగులు దాటి 20 కిలోమీటర్ల దూరంలోని జంగాలపల్లికి వెళ్లాలి. చాలా మందిని ఈ గ్రామం నుంచి వివిధ గ్రామాలకు తరలించినా 11 కుటుంబాలు మాత్రం అక్కడే ఉంటున్నాయి. వీరికి గుమ్మడిదొడ్డి గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే 3 కిలోమీటర్ల దూరాభారం తగ్గుతుంది. ఇది కన్నాయిగూడెం మండలం బంగారుపల్లి గొత్తికోయ గూడెం. ఇక్కడ 30 మంది ఓటర్లున్నారు, వీరంతా 3 కిలోమీటర్ల దూరంలోని కంతనపల్లి గ్రామానికి కాలినడకన వెళ్లి ఓటు వేయాలి.

ఇది మల్హర్ మండలంలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలోనిది. ఇక్కడ వంద మంది వరకు ఓటర్లున్నారు. వీరంతా ఓటు వేయాలంటే 7 కిలోమీటర్ల దూరంలోని తాడిచర్ల పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిందే.

ఈ పల్లెలు సైతం..సొంత గ్రామంలో ఓటు వేయాలనే వారి కోరిక ఏళ్లుగా తీరడం లేదు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల సమయంలో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దాదాపు 3 నుంచి 20 కిలోమీటర్ల వరకు కూడా దూరం ప్రయాణించాల్సిన ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఏటూరునాగారం చల్పాక గ్రామంలో ఏర్పాటు చేసిన 36వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 744 మంది ఓటర్లున్నారు. చల్పాక, బానాజిబంధం, పోలకమ్మవాగు గ్రామాల నుంచి వచ్చి ఓటు వేయాల్సి ఉంది. ఇందులో పోలకమ్మవాగు గొత్తికోయలగూడెం 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. రవాణా మార్గం కూడా సరిగా ఉండదు, వాహనాలు ఏర్పాటు చేస్తే మేలు కలుగుతుంది.

ముల్లెకట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన 42 నెంబర్ గల పోలింగ్ కేంద్రంలో 575 మంది ఓటర్లున్నారు. ఈ పోలింగ్ కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలోని రాంపూర్ గ్రామం నుంచి దాదాపు 250 మంది ఓటర్లు వచ్చి ఓట్లు వేస్తారు.

వాజేడు బొల్లారం ఓటర్లు 5 కిలోమీటర్ల దూరంలోని ఆరుగుంటపల్లి పోలింగ్ కేంద్రానికి రావాల్సి ఉంటుంది. అలాగే బిజినేపల్లి ఓటర్లు 3 కిలోమీటర్ల దూరంలోని మురుమూరు వెళ్తారు.

వెంకటాపురం మండలం తిప్పాపురం, పెంకవాగు, కలిపాక, కొత్తగుంపు నాలుగు గ్రామాలు, సీతారాంపురం, ముత్తారం ఆరు గ్రామాలకు ఆలుబాక గ్రామం పోలింగ్ కేంద్రం ఉంటుంది. ఆయా గ్రామాలు ఆలుబాక రావాలంటే కనీసం 5 నుంచి 7 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుంది. తిప్పాపురంలో ఏర్పాటు చేస్తే 3 నుంచి 4 కిలోమీటర్లు దూరభారం తగ్గుతుంది.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నారాయణ్‌పూర్, గుంటూరుపల్లిలోని 402 మంది ఓటర్లు 4 కిలో మీటర్లు ప్రయాణించి సముద్రాలకు వచ్చి ఓటు వేస్తారు. జఫర్‌ఘడ్ మండలంలోని గువ్వలగూడెం, గుంటూరుపల్లికి చెందిన 402 ఓటర్లు 4 కి.మీ దూరంలోని హిమ్మత్‌నగర్‌లో ఓటు వేస్తారు. అలాగే వేలేరు మండలం చింతతండా, మాటుతండా, బండతండాకు చెందిన దాదాపు 1400 మంది ఓటర్లు 3 కి.మీ. దూరంలోని పీలేరుకు వెళ్తారు.

నర్సంపేట మండలం చింతగడ్డ వాసులు 4 కిలోమీటర్ల దూరంలోని ముత్యాలమ్మ గ్రామానికి రావాల్సి ఉంటుంది. ఇవేకాక ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాలున్నాయి. వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇది లింగాల ఘనపురం మండలంలోని రామచంద్ర గూడెం పంచాయతీ కార్యాలయం. గ్రామంలో 318 ఓట్లు ఉన్నాయి. ఇక్కడి ఓటర్లు 3 కి.మీ పైగా దూరంలోని జీడికల్ గ్రామానికి వెళ్లి ఓటు వేస్తారు.

వృద్ధులకు, దివ్యాంగులకు సౌకర్యం కల్పిస్తున్నాం

80 సంవత్సరాలకు పైబడిన ఓటర్లు, నడవలేని స్థితిలో ఉన్నవారు, దివ్యాంగుల కోసం ఇంటివద్దకే ఈవీఎంలు తీసుకెళ్లే సౌకర్యం కల్పిస్తున్నాం. ముందుగా నమోదు చేసుకున్న వారికి సిబ్బంది అందుబాటులో ఉండి ఓటు వేసేలా చర్యలు తీసుకుంటారు. మిగతా ఓటర్లకు ఆ సౌకర్యం కల్పించడం లేదు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలి.డీఎస్ వెంకన్న, నోడల్ అధికారి, ములుగు జిల్లా

# ఆధారముంటేనే అప్పగింతలు

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కూతురు వివాహం పది రోజుల్లో జరగనుంది. పెళ్లి దుస్తులు, ఆభరణాల కొనుగోలుకు వారు కరీంనగర్ బయల్దేరారు. మధ్యాహ్నం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. వివాహ షాపింగ్ కోసమని చెబితే ఆధారాలు అడిగారు. శుభలేఖలు, సామగ్రి కొనుగోలు చేసే దుకాణం తదితర వివరాలన్నీ చూపిస్తేనే సరిచూసుకొని వదిలేశారు.

రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు ఓవైపు.. జీవితంలో కీలక ఘట్టమైన వివాహ వేడుక మరోవైపు.. ఇదే సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరు పలు కుటుంబాలకు అగ్ని పరీక్షగా మారింది. పెళ్లంటే బంగారు ఆభరణాలు, పట్టుచీరలు, ఇతర లాంఛనాలకు భారీగా నగదు అవసరం ఉంటుంది. ఈ నెల 30న ఎన్నికలు జరగనుండగా 16 నుంచి కార్తీక మాసంలో ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల ప్రచారాలు ఊపందుకునే సమయంలోనే శుభకార్యాలు మొదలవడం విశేషం. ఓవైపు నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చీరలు, కుక్కర్లు, మిక్సీలు తదితర కానుకలను పంపిణీ చేస్తారనే ఉద్దేశంతో తనిఖీ కేంద్రాల వద్ద కొనుగోలు రసీదులు, ఇతర ఆధారాలుంటే తప్ప వదిలిపెట్టడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 60 వరకు ఇలాంటి కేసులే వచ్చాయని, విచారించి వదిలేస్తున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వివరాలు చూపేందుకు అష్టకష్టాలు

పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల నుంచి ఎక్కువ మంది శుభకార్యాల కొనుగోళ్ల కోసం కరీంనగర్ నగరానికే వస్తుంటారు. ఇదే సమయంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేయడంతో నగదు తీసుకెళ్లడం కష్టంగా మారింది. చిరు వ్యాపారులు సైతం నగదు తీసుకెళ్లేందుకు జంకుతున్నారు. గురువారం నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. కల్యాణ మండపాల ఎంపిక మొదలు అప్పగింతల వరకు ప్రతి వ్యవహారం నగదుతో ముడిపడి ఉండటంతో ప్రతి దానికీ రసీదులు, బిల్లులు తీసుకోవాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

హుజూరాబాద్‌కు చెందిన వ్యాపారి ఇటీవల కూతురు పెళ్లికి పట్టు చీరలు, వస్తువులు, కానుకలు తదితర సామగ్రి కొనుగోలుకు హనుమకొండ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎల్కతుర్తి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. శుభలేఖలు, రసీదులు, కొనుగోలుకు సంబంధించిన అన్ని బిల్లులు చూపెట్టి వారి నుంచి వదిలించుకునేసరికి తల ప్రాణం తోకకొచ్చింది.

విడిపించడానికి ముప్పు తిప్పలు

రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల వద్ద ప్రధాన రహదారులపై పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఒక్కో వివాహానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అలంకరణ, కేటరింగ్, పెళ్లి వస్త్రాలకు వెచ్చిస్తున్నారు. తనిఖీల్లో పట్టుకున్న నగదుకు సరైన ఆధారాలు చూపకుంటే వెంటనే చేతికి అందడం లేదు. ఓవైపు పెళ్లి పనుల్లో తీరిక లేకుండా ఉన్న కుటుంబాలు, పట్టుకున్న నగదు విడిపించడానికి తిరగాల్సిన పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయి.

# ఇక ప్రచార పక్షం

కరీంనగర్: శాసనసభ ఎన్నికల సమరంలో అసలు సిసలు పోరుకు రంగం సిద్ధమైంది. పోటీలో ఉండే అభ్యర్థులెవరనేది తేలడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వాతావరణం మరింత వాడీవే'ఢీ'గా మారబోతోంది.. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఆయా పార్టీలు ప్రచారంలో వేగాన్ని పెంచబోతున్నాయి. సరిగ్గా పక్షం రోజుల తరువాత పోలింగ్ జరుగనుండటంతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహాత్మక ఎత్తుగడలతో దూసుకెళ్లనున్నాయి.. ఊరూవాడా సందడితో మరింత హోరెత్తించనున్నాయి.. ఇన్నాళ్లు సాగించిన ప్రచారం ఒక ఎత్తైతే ఇకమీద కొనసాగించేది మరో ఎత్తుగా నిలవనుంది. అధికార భారాసతో పాటు కాంగ్రెస్, భాజపా అభ్యర్థులు ఎక్కడా 'తగ్గేదేలే' అన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నారు. కొన్నిచోట్ల బీఎస్పీ అభ్యర్థులు సైతం ప్రచారంలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా ముందుకు సాగుతున్నారు.

గెలుపే లక్ష్యంగా...!

ప్రధాన పార్టీలన్నీ కీలక స్థానాలపై దృష్టి సారించాయి. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీలు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. ముందుగా భారాస తమ అభ్యర్థులను ప్రకటించగా.. ఆ తరవాత కాంగ్రెస్, భాజపా కూడా కొద్దిగా ఆలస్యమైనా.. గట్టి పోటీదారులను రంగంలోకి దించింది. ఇదే సమయంలో బీఎస్పీ కూడా సామాజిక సమీకరణాల ఆధారంగా అన్నిచోట్ల తమ పోటీదారులను బరిలోకి దింపింది. దీంతో గడిచిన కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో ప్రచారానికి ఒక ఊపు వచ్చింది. తాజాగా మరింత జోరుని పెంచేందుకు వ్యూహాల్ని రూపొందించుకుంటున్నారు. ఎవరికి వారుగా తమ పోటీదారుల వైఫల్యాల్ని ఎత్తిచూపుతూ తమను ఆశీర్వదించమని కోరుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎక్కువమంది తమకే టికెట్ వస్తుందనే ధీమాతో అధికార భారాస అభ్యర్థులకు దీటుగా ప్రచారాల్ని సాగించారు. 12 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా భారాస, భాజపా, కాంగ్రెస్ పార్టీలు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

ఆధిక్యత చాటాలని..!

12 అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థియే ఎమ్మెల్యేగా ఉండాలని మూడు పార్టీలు లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాయి. అధికార భారాస 10 స్థానాల్లో తమ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలుండటంతో ఆ నియోజకవర్గాల్లో పట్టుని నిలబెట్టుకోవడంతోపాటు అదనంగా మరో రెండింటిని కచ్చితంగా గెలవాలనే పట్టుదల చూపుతోంది. హుజూరాబాద్‌లో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కౌశిక్‌రెడ్డికి ఈసారి కారు గుర్తుమీద పోటీ చేసే అవకాశాన్ని కల్పించింది. మంథనిలో గత ఎన్నికల్లో ఓటమి చెందిన పుట్ట మధూకర్‌ను రంగంలో దింపింది. ఎక్కడా అలసత్వానికి చోటు ఇవ్వకుండా అన్ని స్థానాల్లో గులాబీ జెండాను ఎగురవేయాలనే జోష్‌ను చూపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో ఎక్కువ మందికి టికెట్లు ఖరారు చేసి వారే తమ గెలుపు గుర్రాలనే సంకేతాలిచ్చింది. గత ఎన్నికల్లో మంథని స్థానంలోనే కాంగ్రెస్ అభ్యర్థి గెలవగా.. ఈసారి అన్ని స్థానాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. అన్నిచోట్ల బలమైన అభ్యర్థులను రంగంలో దింపి ప్రచారంలో దూసుకెళ్తోంది. భాజపా తనకున్న హుజూరాబాద్ స్థానాన్ని గెలుచుకోవాలని పట్టుదలతో ఉండటంతోపాటు మిగతా అన్ని స్థానాల్లోనూ గట్టి అభ్యర్థులను బరిలో నిలిపింది. ఎంపీలు బండి సంజయ్, అర్వింద్‌లను కరీంనగర్, కోరుట్ల నుంచి రంగంలో దింపి ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోమనే సంకేతాలు ఇచ్చింది.

# సంచుల్లో ధాన్యం.. తరలింపులో జాప్యం

సిరిసిల్ల: ఈ చిత్రంలో కనిపిస్తున్న తూకం వేసిన ధాన్యం బస్తాలు ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలోనివి. ఈ గ్రామంలో యాసంగిలో 30 వేల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. తూకం వేసిన ధాన్యం తరలించేందుకు నాలుగు రోజులుగా లారీలు రావడం లేదు. సోమవారం రైతులే స్వయంగా ట్రాక్టర్లను పెట్టుకుని రెండు వేల క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. కష్టాన్ని భరించి.. పంట పండించిన అన్నదాతలు చివరికి నష్టాన్ని మూటగట్టుకుంటున్నారు. ప్రారంభంలో ఎరువులు, విత్తనాలతో పెట్టుబడులు భారమయ్యాయి. పంట ఎదిగే దశలో తెగుళ్ల దాడి నుంచి కాపాడుకున్నారు. చివరికి చేతికొచ్చే దశలో మార్చి, ఏప్రిల్‌లో ప్రకృతి కన్నెర్ర చేయడంతో వడగళ్ల వానలు నిండా ముంచాయి. ఇన్ని ఎదురుదెబ్బలను తట్టుకుని కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే.. తరుగు, అధిక తూకం పేరిట కోతలు తప్పడం లేదు. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె మొదలవుతుంది.



వానాకాలం సీజన్ ప్రారంభమవుతుంది. వచ్చే కాలానికి తిరిగి నారుమళ్లు సిద్ధం చేసుకోవాలి. అయినప్పటికీ జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యంలో సగం కూడా సేకరణ జరగలేదు. యాసంగి ధాన్యం సేకరణ జిల్లాలో 258 కేంద్రాలకు గాను 254 కేంద్రాల్లో చేపడుతున్నారు. సీజన్‌లో 3.5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సోమవారం నాటికి 1.29 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 2.21 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉంది. మిల్లులకు చేరిన ధాన్యంలో 48,999 మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.100.94 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. వారం రోజులుగా లారీల కొరతతో తూకాలు, తరలింపు మందకొడిగా సాగుతోంది.

ఎఫ్‌సీఐకి కేటాయింపులతో ఇబ్బందులు

సేకరించిన ధాన్యం నాణ్యతగా లేదనే సాకుతో మిల్లర్లు అన్‌లోడింగ్‌కు విముఖత చూపుతున్నారు. రైతులు తరుగును భరించి.. బస్తాకు అదనంగా డబ్బులు ఇస్తామన్నా వారం రోజులుగా కేంద్రాలకు లారీలు రావడం లేదు. కారణం సీఎంఆర్‌కు కేటాయించాల్సిన బియ్యం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని గడువు విధించడంతో మిల్లర్లు వాటిపై శ్రద్ధ చూపుతున్నారు. దీంతో మిల్లుల్లోని ధాన్యం మరాడించడంతోపాటు పూర్తయినవి కరీంనగర్‌లోని ఎఫ్‌సీఐ గోదాములకు తరలిస్తున్నారు. పూర్తిస్థాయిలో లారీలన్నీ అటు వెళ్లడంతో కేంద్రాలకు తక్కువయ్యాయి. రైతులు తమ సొంత ట్రాక్టర్లలో రైస్ మిల్లులకు తీసుకెళ్లినా హమాలీల కొరతతో దింపుకోవడం ఆలస్యమవుతోంది. కోనరావుపేట మండలంలో ధాన్యం కొనుగోలుకు 14 పీఏసీఎస్ కేంద్రాలున్నాయి. కేంద్రాల్లో తరుగు పేరిట కోతలు విధించి తూకం వేసినా.. మిల్లులకు వెళ్లే సరికి జాప్యం కావడంతో రెండోసారి అక్కడా కోత పెడుతున్నారు. దీంతో ఒక్కో కేంద్రంలో తూకం వేసిన ధాన్యం తరలించి మిల్లుల్లో దించాకే మరిన్ని తూకం వేస్తున్నారు. వారం రోజులుగా లారీలు రాకపోవడంతో తూకం వేసిన 25 వేల బస్తాలు కేంద్రాల్లోనే ఉన్నాయి.

శుద్ధి చేసినా కోత తప్పడం లేదు– చాతాని రాంరెడ్డి, రాచర్ల గొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం

నా సొంత భూమితోపాటు యాసంగిలో పది ఎకరాల్లో వరి సాగు చేశాను. తొలి విడత శుద్ధి చేయని ధాన్యం 71 బస్తాలు తూకం వేశారు. ఇందులో 40 కిలోల బస్తాకుగాను అదనంగా 42.600 కిలోల చొప్పున తూకం వేశారు. మిల్లుకు చేరాక మొత్తంగా మరో నాలుగు క్వింటాళ్ల కోత పెట్టారు. తరుగు, కోతలతో రూ.12 వేల వరకు కోల్పోవాల్సి వచ్చింది. శుద్ధి చేయని ధాన్యాన్ని రెండు సార్లు కోత పెడుతున్నారని మిగతా ధాన్యాన్ని శుద్ధి చేశాను. అయినా బస్తాకు అదనంగా కిలో కోత విధించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వారం రోజులుగా కాపలా..– చెంచు రాంరెడ్డి, నిమ్మపల్లి, కోనరావుపేట మండలంధాన్యం తూకం వేయగా మొత్తం 600 బస్తాలు అయ్యాయి. కేంద్రం నిర్వాహకులు మిల్లులకు తరలించే వరకు నాదే బాధ్యత అని చెప్పారు. వారం రోజులుగా పగలు, రాత్రి బస్తాలకు కాపలా ఉంటున్నా. లారీలు పంపాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఏర్పాట్లు చేస్తున్నాంజితేందర్‌రెడ్డి, డీసీఎస్‌వోకొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తరలింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని మిల్లుల వారీగా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నాం. సీఎంఆర్‌లో మిల్లుల నుంచి బియ్యం పంపిస్తే మరింత ఖాళీ ఏర్పడుతుంది. తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా లారీలను కేటాయిస్తాం.

# పైసల్ పడతలే!

సూర్యాపేట : ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన మల్లయ్య యాసంగిలో ధాన్యాన్ని విక్రయించేందుకు పీఏసీఎస్ కేంద్రంలో పోశాడు. కేంద్రంలో పోసిన పది రోజుల తరువాత ధాన్యం కాంటా వేసి మిల్లుకు తరలించారు. విక్రయించి నేటికి పది రోజులు కావొస్తున్నా ఖాతాల్లో నగదు జమ కాకపోవడం గమనార్హం. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచిస్తున్నా.. కింది స్థాయి సిబ్బంది కారణంగా నిత్యం అన్నదాతలు అవస్థలు పడుతూనే ఉన్నారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన అన్నదాతలు చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయిద్దామంటే అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గతసారి ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే నగదు జమ అయ్యాయి. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.కొన్ని కేంద్రాల్లో రోజుల తరబడి నగదు జమ కావడం లేదు.అన్నదాతల అవస్థలు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 968 పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు తనిఖీలు చేపట్టి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశిస్తున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అకాల వర్షానికి తోడు లారీల కొరత తోడవడంతో కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయి. ధాన్యం దిగుమతికి తేమ శాతం లేదని, ధాన్యం తడిసిందని, వడ్లు తూర్పార పట్టలేదని వివిధ కారణాలు సాకుగా చూపుతూ మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. ధాన్యం దిగుమతికి బస్తాకు కేజీ చొప్పున తరుగు తీస్తుండటంతో అన్నదాతలు అదనంగా నష్టపోవాల్సిన పరిస్థితి. వీటన్నింటిని అధిగమించి ధాన్యం విక్రయించి నా నగదు చెల్లింపులో సైతం ఆలస్యం అవుతుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

# అస్తవ్యస్తంగా నీటి సరఫరా.. తీరని ఆవేదన



కరీంనగర్ : ఎండాకాలంలో ప్రతి రోజు తాగునీరు సరఫరా అవుతుందని భావించిన పలు ప్రాంతాల ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. బోరు బావులు లేని ఇంటి యజమానులు ఒక రోజు నల్లా రాకపోతే నానావస్థలు పడుతున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ఆకస్మికంగా నిలిపి వేస్తుండటంతో ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు, ప్రజలు ఆగ్రహిస్తున్నారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ నగర్ రిజర్వాయర్ పరిధిలో 11 డివిజన్లు, రెండు ట్యాంకులు, సుమారు 10 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నల్లా నీరు సరఫరా అవుతుంది. ఈ రిజర్వాయర్‌కు కోర్టు ట్యాంకు నుంచి పంపింగ్ చేస్తుండటంతో ఆయా కాలనీలకు సరఫరా చేస్తున్నారు. వేకువజామున రెండు ట్యాంకులు అంటే 29 లక్షల లీటర్ల శుద్ధజలం నిల్వ చేసుకొని ఆరు డివిజన్లకు పంపిణీ చేయడంతో ఆరు గంటల్లో ఖాళీ అవుతుంది. ఆ తర్వాత 12 లక్షల ట్యాంకును ప్రతి నాలుగు గంటలకు ఒకసారి నింపి సరఫరా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అస్తవ్యస్తంగా తయారైంది.

నీరు వదలడం లేదనే వాదన కోర్టు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 30 హెచ్‌పీల మోటార్లు రెండు, ఒకటి 40 హెచ్‌పీల మోటార్లు నిరంతరంగా పని చేస్తున్నాయి. అంబేడ్కర్‌నగర్‌లో ట్యాంకు నింపుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ తరచుగా మోటార్లు నిలిపి వేస్తున్నారని, సరఫరాలో ఆలస్యం అవుతుందని క్షేత్రస్థాయి సిబ్బంది వాదిస్తున్నారు. కోర్టు రిజర్వాయర్‌లో మాత్రం అంతా సవ్యంగానే ఉందని బదులు ఇస్తుండటంతో శుద్ధజలం ఎక్కడికి వెళ్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సంపులో నిల్వ చేసినా కనీసం ట్యాంకులోకి ఎక్కిస్తే 25 శాతం నీరు కూడా ఉండటం లేదు.

పలు కారణాలతో...

అంబేడ్కర్‌నగర్ ట్యాంకు పరిధిలో పూర్తిగా పేదల కాలనీలు అధికంగా ఉన్నాయి. వీరంతా నల్లా నీటిపైనే ఆధారపడతారు. ప్రతి రోజు నీళ్లు వస్తున్నాయని భావించి నిల్వ చేసుకోవడం లేదు. మండుటెండల్లో అవసరాలు పెరిగి నల్లా రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. గత 20 రోజులుగా ఫిల్టర్‌బెడ్‌లో రిపేర్లు, డ్యాంలో లెవల్స్ డౌన్, పవర్ కట్, కోర్టు ట్యాంకులో అదనంగా 40 హెచ్‌పీల మోటారు బిగింపు, ట్యాంకులో వాల్వు రిపేర్, ప్రధాన పైపులైను లీకేజీ వంటి కారణాలతో ఈ ప్రాంతానికి నీటి సరఫరా పలుమార్లు నిలిపి వేశారు.

క్షేత్రస్థాయిలోనే సమస్యలు

రిజర్వాయర్ పరిధిలో ఏ చిన్నపాటి సమస్యలు వచ్చినా ఆ రోజు పలు కాలనీలకు మొత్తమే నల్లా నీరు నిలిపి వేస్తున్నారు. ఇదే తరహాలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు కోర్టు రిజర్వాయర్‌లో వాల్వ్ చెక్ నట్టు పాడు కావడంతో అంబేడ్కర్‌నగర్‌కు 9 గంటల వరకు పంపింగ్ నిలిపి వేశారు. ఆ తర్వాత పంపింగ్ మొదలైంది. అప్పటి వరకు 29 లక్షల లీటర్ల నీటిని పూర్తిగా పంపిణీ చేసుకొని సిద్ధంగా ఉండే వీలుంది. ఇంకేముంది సరఫరా వేళలు పూర్తిగా మార్చేసి ఇష్టానుసారంగా ఇవ్వడం ప్రారంభించారు. తీరా మధ్యాహ్నం 1.30 గంటలకు దీని పరిధిలోని 4, 44 డివిజన్లకు నీటి సరఫరా జరగదని కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చారు. ట్యాంకుల్లో నీళ్లు లేవని, కోర్టు రిజర్వాయర్‌లో షట్టర్ పని చేయడం లేదని సాకుగా చూపించారు. దీనిపై ఆరా తీస్తే యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుండగా.. కొన్ని డివిజన్లకు నిలిపి వేసినట్లు స్పష్టమైంది. ఇక్కడ క్షేత్రస్థాయిలో నీటి పంపిణీ సక్రమంగా చేయడం లేదు. జంపింగ్ సప్లయ్‌లు ఇస్తుండటంతోనే అన్ని సమస్యలకు కారణమనే అభిప్రాయం ఉంది.

సమీక్షించి చర్యలు తీసుకుంటాం– నాగ మల్లేశ్వరరావు, ఎస్ఈ, నగర పాలిక

అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్‌లో ఇబ్బందులు పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఈఈకి బాధ్యతలు అప్పగించాం. ఈ ట్యాంకు పరిధిల్లోంచి అధిక ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై సమీక్షించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# నిధులున్నా నిర్లక్ష్యమేనా?



ముస్తాబాద్: దాదాపు మూడేళ్ల కిందట కురిసిన వర్షాలకు కల్వర్టులు దెబ్బతిని వరద తాకిడికి కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు రోజుల తరబడి నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. వర్షాలు ప్రారంభమైతే మళ్లీ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ముస్తాబాద్ మండలంలో దాదాపు మూడు సంవత్సరాల క్రితం వర్షాల కారణంగా బందనకల్– బంజరుపల్లె మధ్య కల్వర్టు తెగిపోయింది. బందనకల్ నుంచి బంజరుపల్లె మీదుగా తక్కువ దూరంలో సిద్దిపేట జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి వాహనదారులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు తెగిపోవడంతో అప్పటిలో దాదాపు పదిహేను రోజులకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల వద్దకు వెళ్లే రైతులు ఇక్కట్లకు గురయ్యారు. వర్షాకాలం పూర్తికాగానే రూ. 5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తరవాత కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించగా రూ.35 లక్షలు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఇంతవరకు పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. దీంతోపాటు నిధులు మంజూరైన తెర్లుమద్ది–గోకవాడ మధ్య నక్కవాగు కల్వర్టు పనులు పూర్తి చేశారు. బందనకల్–బంజరుపల్లె కల్వర్టు పనులు మాత్రం ఇంతవరకు ప్రారంభించలేదు. వర్షాకాలం సమీపిస్తుంది. వర్షాలు పడక ముందే పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నా స్పందన లేదు. గన్నెవారిపల్లె గ్రామ పరిధిలోని నిమ్మవారిపల్లెలో రోడ్డు తెగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుపోగా తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేయగా పైపులు వేసి తాత్కాలికంగా పనులు చేశారు. పక్కాగా మరమ్మతుల కోసం రూ. 75 లక్షలు మంజూరు చేశారు. పనులు మాత్రం ఇంతవరకు ప్రారంభించిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం లోపు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.

త్వరగా చేపడితే మేలు– గనగోని వెంకటస్వామి గౌడ్, బందనకల్ మూడు సంవత్సరాల క్రితం బందనకల్ గ్రామ శివారులో బంజరుపల్లెకు వెళ్లే రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. మంత్రి కేటీర్ చొరవతో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయినా పనులు చేపట్టడం లేదు. నిత్యం బందనకల్ నుంచి బంజరుపల్లె మీదుగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు చొరవ తీసుకొని వర్షాకాలం రాక ముందే పనులు పూర్తయ్యేలా చూడాలి.

గుత్తేదారులతో మాట్లాడుతాం– ఇనాయితుల్లా, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ బందనకల్– బంజరుపల్లె మధ్య కల్వర్టు నిర్మాణానికి రూ. 35 లక్షలు మంజూరయ్యాయి. టెండరు పూర్తయి నెలలు గడుస్తుంది. అలాగే గన్నెవారిపల్లె గ్రామ పరిధిలోని నిమ్మవారిపల్లెలో తెగిన రహదారికి రూ. 75 లక్షలకు ప్రొసీడింగ్స్ వచ్చింది. పనులు ప్రారంభించాల్సి ఉంది. సంబంధిత గుత్తేదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూస్తాం.

# యథేచ్ఛగా దోపిడీ

కోరుట్ల: జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఇసుక డిపోలను ఏర్పాటు చేసి అవసరమైన వారు ఆయా కేంద్రాల నుంచే కొనుగోలు చేసి తీసుకుపోయే విధంగా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించకపోవడం.. రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. జిల్లాలో గోదావరి తీర ప్రాంతాలతో పాటు వాగులు, కాలువల్లో వర్షాలు, భారీ వరదలతో ఇసుక మేటలు వేశాయి. ఇది ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారికి వరంగా మారింది. పెద్దవాగు, గోదావరి నది ఇసుకకు డిమాండ్ ఉండటంతో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు ఆయా గ్రామాల్లోని నదుల నుంచి నేరుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు.

ప్రాణాలుపోతున్నా పట్టించుకోరా..? ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న క్రమంలో ట్రాక్టర్లు రహదారులపై పలువురిని ఢీకొట్టి ప్రాణాలు తీస్తున్నప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ప్రమాదాల సంఖ్య మరింత పెరిగినప్పటికీ ప్రజాప్రతినిధులకు తల్గొగ్గి కేసులను సైతం తప్పుదారి పట్టిస్తున్నారు. గతంలో ప్రమాదాలు జరిగి రెండంకెల సంఖ్యలో వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు వదలగా, మరికొంత మంది ప్రమాదాల బారిన పడిపడ్డారు. ఇసుక రవాణా వాహనాలకు వెనుకవైపున ప్రమాదాలను నివారించే స్టిక్కర్లు లేకపోవడం, ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టినప్పుడు నంబర్‌ప్లేట్లు లేకపోవడంతో వాహనాలను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన రీచ్‌లను ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఎక్కువ ధరలకు కొనుగోలు చేసి నిర్మాణాలకు వాడాల్సిన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారుల మాత్రం తమకు తోచిన విధంగా ధరలను నిర్ణయిస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ నిర్లక్ష్యంఇసుక విషయంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు అభాసుపాలవుతున్నాయి. స్థానికంగా అనుమతి ఉన్న రీచ్‌లు లేకపోవడంతో జిల్లాలో గోదావరి తీర ప్రాంతాలతో పాటు వాగుల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా చేస్తున్నారు.

# సామాజిక సమన్వయం.. మెరుగైన నిర్వహణ

గోదావరిఖని: పల్లెలు, పట్టణాల్లో ప్రాథమికంగా వైద్య సేవలను పెంపొందించడంతో పాటు ఆయా ప్రాంత ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కలిగించేందుకు ప్రభుత్వం ఇటీవల నియమించిన 'జన్ ఆరోగ్య సమితి'లతో ప్రయోజనం చేకూరనుంది. గతంలోనూ రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, పల్లెల్లోని ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక కమిటీలున్నప్పటికీ కొందరికి మాత్రమే ప్రవేశముండేది. వాటికి బదులుగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల నిర్వహణను మెరుగు పరిచేందుకు వీటిని ఏర్పాటు చేయాలని మార్చి నెలాఖరులో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారంగా అత్యధిక కేంద్రాల్లో 'జన్ ఆరోగ్య సమితి'లను ఏర్పాటు చేసి వాటి సమన్వయం, సహకారంతో నిర్వహణను మెరుగు పరుచుకుంటుండగా ఇంకా కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా ఆరోగ్య కేంద్రాలకు విడుదలయ్యే నిధుల వినియోగం, ఔషధాల అవసరం, సదుపాయాల కల్పన, నిర్వహణ మెరుగు తదితర అంశాలపై సమితి సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల్లోని జన్ ఆరోగ్య సమితి సమావేశాలు ప్రతినెల నిర్వహించి అవసరమైన తీర్మానాలు చేయనున్నారు.

అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం

ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగిన సమాజంలోని వివిధ వర్గాలకు చెందినవారు జన్ ఆరోగ్య సమితిలో సభ్యులుగా ఉంటారు. ఇందులో ఎక్స్ అఫీషియో సభ్యులు, సాధారణ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు తదితర మూడు విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. పల్లె దవాఖానాలు(సబ్ సెంటర్ల) జన్ ఆరోగ్య సమితి అధ్యక్షులుగా గ్రామ సర్పంచి, సహ అధ్యక్షులుగా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వ్యవహరిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల జన్ ఆరోగ్య సమితి అధ్యక్షులుగా మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, సహ అధ్యక్షులుగా జిల్లా ఉప వైద్యాధికారి వ్యవహరించనున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల జన్ ఆరోగ్య సమితి అధ్యక్షులుగా సంబంధిత డివిజన్, వార్డునకు చెందిన కార్పొరేటర్, కౌన్సిలర్, వైద్యాధికారి సహ అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వశక్తి సమాఖ్యలు, స్వశక్తి సంఘాల అధ్యక్షులు, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన సీడీపీఓ, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులు, ప్రజారోగ్య శాఖ, స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు, నెహ్రూ యువ కేంద్రం, ఆయా ప్రాంతాల్లోని స్వచ్ఛంద యువజన సంఘాలు, దీన్‌దయాల్ అంత్యోదయ ప్రతినిధులు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు, ఐదుగురికి మించకుండా ఆశ కార్యకర్తలు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు(స్త్రీ, పురుషులు), గ్రామ, పట్టణాభివృద్ధి సంస్థల ప్రతినిధులు, ప్రజారోగ్యంతో సంబంధమున్న వివిధ శాఖలకు చెందిన ప్రతినిధులు జన్ ఆరోగ్య సమితిలో సభ్యులుగా ఉండనున్నారు. ఒకరు, ఇద్దరు పిల్లల తర్వాత వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న పురుషులు, టీబీ వ్యాధి సోకి నయమైన వ్యక్తి, ట్రాన్స్‌జెండర్, దివ్యాంగులు సమితిలో సభ్యులుగా వ్యవహరించనున్నారు. మొత్తం కమిటీలో 50 శాతం మహిళలు ఉండాలి.

చేపట్టాల్సిన విధులు

ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన సిటిజన్ చార్టర్ అమలును జన్ ఆరోగ్య సమితి పర్యవేక్షిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు, మందుల సరఫరా, కౌమార, మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి, ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు యోగా, ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలి. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో సురక్షితమైన తాగునీరు, పౌష్టికాహారం సరఫరా, సంపూర్ణ పారిశుద్ధ్యం, శాస్త్రీయ పద్ధతిలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి. ప్రజల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల స్వీకరణపై దృష్టి సారించాలి. పల్లె దవాఖానాలకు నిర్వహణ కోసం ఏడాదికి రూ.50 వేలు, ఆరోగ్య కేంద్రాలకు రూ.1.75 లక్షలు ప్రభుత్వం విడుదల చేస్తుండగా వాటిని వినియోగించాల్సిన తీరుపై జన్ ఆరోగ్య సమితిలో చర్చించి 50 శాతం సభ్యుల ఆమోదంతో తీర్మానం చేసి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం సరఫరా చేయలేని అత్యవసరమైన మందులను కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేసేలా నిర్ణయం తీసుకోవచ్చు.

ఆరోగ్య కేంద్రాల స్వరూపం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 18

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 07

పల్లె దవాఖానాలు: 66

బస్తీ దవాఖానాలు: 04

# కొత్త ఉద్యోగాలు ఏవీ

గోదావరిఖని: సింగరేణిలో ఖాళీగా ఉన్న 558 పోస్టులను భర్తీ చేస్తామని యాజమాన్యం జనవరిలో ప్రకటించింది. ఫిబ్రవరిలో విడుదల చేస్తామన్న నోటిఫికేషన్ ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో నిరుద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అర్హులైన అభ్యర్థులు ఇప్పటికే పలు కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ తీసుకున్నారు. 277 కొత్తవారికి, 281 ఖాళీలను అర్హులైన అంతర్గత ఉద్యోగులతో భర్తీ చేస్తామని ప్రకటించింది. ఇంజినీరింగ్, పర్సనల్, అకౌంట్స్, మైనింగ్, వైద్య విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఇప్పటి వరకు వీటి భర్తీకి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రకటన సైతం జారీ చేయకపోవడంతో వాటిపైనే ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు, అంతర్గతంగా అర్హులైన ఉద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారు. కోల్‌బెల్టు ప్రాంతంలో ఎంతో మంది పట్టభద్రులైన నిరుద్యోగులు సింగరేణిలో ఉద్యోగం సంపాదించేందుకు ప్రణాళికలు చేసుకున్నారు. కొంతమంది స్థానికంగా శిక్షణ తీసుకుంటుండగా మరి కొంతమంది రాజధానికి వెళ్లి శిక్షణ కేంద్రాల్లో సన్నద్ధమవుతున్నారు.

అభ్యర్థులు అధికమే...

సింగరేణిలో ప్రకటించిన నోటిఫికేషన్ కోసం కోల్‌బెల్టు ప్రాంతంలో ఉన్న అర్హులైన నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఇంజినీరింగ్‌తో పాటు ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ పూర్తి చేసిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా సింగరేణి విస్తరించి ఉన్న నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న వారికి 90 శాతం రిజర్వేషన్ ఉండటంతో ఈ ప్రాంతాల వారు నోటిఫికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి 58 పోస్టులు, 500 పోస్టులు స్థానికులకే కేటాయించనున్నారు. భారీ మొత్తంలో నియామకాలు చేపట్టే సింగరేణిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైన నిరుద్యోగులకు యాజమాన్యం ఇంకా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుత్సాహం నెలకొంది. ఇక అంతర్గత ఉద్యోగులకు సంబంధించిన 281 ఖాళీల్లో 20 జూనియర్ ఇంజినీర్ పోస్టులకు ఈనెల 5న పరీక్షలు నిర్వహించారు. 11 సంక్షేమాధికారుల ఖాళీలకు రాత పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారసత్వ ఉద్యోగాల కింద సింగరేణిలో చేరిన ఉద్యోగులు ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీలు చదివిన వారు ఉండటంతో యాజమాన్యం జారీ చేసే అంతర్గత ఆదేశాలపై ఆశలు పెంచుకున్నారు. ఈ విషయంలో యాజమాన్యం త్వరగా నిర్ణయం తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.




అమరావతి: జగనన్న దెబ్బకు అమరావతికి మొహం చాటేసిన సంస్థల జాబితా చాలానే ఉందని తెదేపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. 'వై ఏపీ హేట్స్ జగన్' అంటూ ఓ పోస్టర్‌ను సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు. అందులో అమరావతి నుంచి తరలి వెళ్లిన సంస్థల జాబితాను ప్రస్తావించారు. దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయిందన్నారు. "కేంద్ర కార్యాలయాలు ఎక్కడ పెట్టాలో తెలియక ఆ సంస్థలు ఏపీవైపే రావట్లేదు. ప్రతిష్ఠాత్మక సంస్థలు కూడా హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రాష్ట్రంలో గందరగోళాలు, నిర్లక్ష్యాలు జరగకుండా అమరావతి రాజధానిగా ఉండి ఉంటే ఈ సంస్థలన్నీ తమ కార్యకలాపాలు ఇప్పటికే ప్రారంభించి ఉండేవి. జగన్ రివర్స్ పాలన వల్ల రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయింది. ఓటు అనే ఆయుధంతో వైకాపా ప్రభుత్వాన్ని తరిమికొడదాం" అని గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.




## ఫుడ్ డెలివరీ చేసినట్లు మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు: అచ్చెన్నాయుడు



మంగళగిరి: మద్యపాన నిషేధం చేస్తానన్న సీఎం జగన్.. ఊరూ వాడా నాసిరకం లిక్కర్ తెచ్చి ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. బ్లాక్‌లో సినిమా టికెట్లు అమ్మిన మాదిరి వైకాపా నేతలు నాసిరకం మద్యాన్ని అమ్ముతున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అచ్చెన్న మాట్లాడారు. ఫుడ్ డోర్ డెలివరీ చేసినట్లు మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నాసిరకం మద్యం తయారీ నుంచి అమ్మకం వరకూ మొత్తం సీఎం జగనే చేయిస్తున్నారని అచ్చెన్న విమర్శించారు. కల్తీ మద్యం తాగి రాష్ట్రంలో గత నాలుగేళ్లలో 34 వేల మంది చనిపోయారన్నారు. మద్యం ద్వారా ప్రభుత్వ అధికారిక ఆదాయం రూ. 1. 14 లక్షల కోట్లయితే.. అనధికారికంగా సీఎం జగన్‌కు రూ.లక్ష కోట్ల సొంత ఆదాయం వచ్చిందని అచ్చెన్న ఆక్షేపించారు. ధరలు పెంచితే మద్యం తాగేవారు తగ్గుతారన్నది ఓ పిచ్చి వాదన అని మండిపడ్డారు. వైకాపా పాలనలో ఏటా మద్యం ధరలు పెరిగాయే కానీ ఎక్కడా తగ్గలేదన్నారు. మేనిఫెస్టోలో కనీసం 30 శాతం హామీలు కూడా నెరవేర్చకుండా 99 శాతం హామీలు అమలు చేశామని జగన్ చెప్పడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

## పుంగనూరుకు ప్రముఖ విద్యుత్ బస్సు తయారీ సంస్థ



కీలకమైన పెట్టుబడుల ప్రకటన ఒకటి వచ్చింది. పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్న వేళ.. అందరూ అచ్చెరువు పొందేలా వచ్చిన ఈ ప్రకటనతో ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు దశను దిశను మార్చేస్తుందని చెబుతున్నారు. జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ బస్సులు.. ట్రక్కుల తయారీ సంస్థ ఏపీకి రానుంది. ప్రపంచంలోనే అతి పెద్ద తయారీ యూనిట్ ను ఏపీలో నెలకొల్పనుంది. దీనికి పుంగనూరు వేదిక కానుంది. చైనా బయట ఈ స్థాయిలో ఇంత భారీగా యూనిట్ ఏర్పాటు చేయటం ఇదే తొలిసారి. ఏపీ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఈ భారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ కోసం 800 ఎకరాల భూమిని.. పెద్ద ఎత్తున రాయితీల్ని ఇవ్వనున్నారు. ఈ పరిశ్రమ కోసం రూ. 4640 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈ పరిశ్రమ కారణంగా 8080 మందికి ఉపాధి లభించనుంది. ఈ పరిశ్రమలో ఎలక్ట్రిక్ బస్సులతో పాటు.. డీజిల్ బస్సుల్ని ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రిట్రోఫిట్టింగ్ యూనిట్ ను ఏర్పాటు చేస్తారు. ఈ నెలాఖరులో యూనిట్ నిర్మాణం ప్రారంభం కానుంది. 2025 ప్రారంభం నాటికి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు. 2027 నాటికి ఏటా 50వేలకు పైగా బస్సులు.. ట్రక్కులు తయారు చేసే సామర్థ్యానికి చేరుకుంటుందని చెబుతున్నారు. అంతేకాదు.. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాల్ని కూడా ఇక్కడే ఉత్పత్తి చేసి.. అంతర్జాతీయంగా సరఫరా చేసే ఆలోచనలోనూ కంపెనీ ఉంది. ఏపీ ఇమేజ్ ను మరింత పెంచే ఈ పరిశ్రమతో మరిన్ని విదేశీ పెట్టుబడులు రావటం ఖాయమన్న మాట వినిపిస్తోంది.




ముంబయిలోని వాంఖడే మైదానం.. ఈ పేరు వినగానే అక్కడ టీమ్‌ఇండియా సాధించిన ఎన్నో ఘనతలు గుర్తుకొస్తాయి. ఎన్నో విజయాలు స్ఫూరిస్తాయి. తనకు సొంత మైదానమైన ఇక్కడ క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ పరుగుల వరద పారించారు. రికార్డుల మోత మోగించారు. కానీ అదంతా 2011కు ముందువరకే. ఆ తర్వాత వాంఖడే అంటే.. ధోని సిక్సర్‌తో టీమ్‌ఇండియా ప్రపంచకప్ గెలిచిన క్షణం, విరాట్ భుజాలపై సచిన్ ఊరేగిన దృశ్యం, రెండోసారి భారత్ వన్డే విశ్వవిజేతగా నిలిచిన వేళ మనసులోని నుంచి పెల్లుబికిన కన్నీళు.. ఇవే గుర్తుకొస్తాయి. 2011లో వాంఖడేలో ఫైనల్లో శ్రీలంకపై గెలిచిన భారత్ రెండోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఇప్పుడు మళ్లీ 12 ఏళ్ల తర్వాత 2023 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా ఫైనల్ ఆడబోతోంది. ఇప్పుడు వేదిక అహ్మదాబాద్‌కు మారింది. మరి ప్రపంచలోని అతి పెద్దదైన నరేంద్ర మోదీ స్టేడియం టీమ్‌ఇండియాకు మరుపురాని బహుమతినిస్తుందా? ఇక్కడ కప్పుకు భారత్ మూడోసారి ముద్దు పెడుతుందా?

**కళ్లన్నీ ఇక్కడే..** సొంతగడ్డపై ప్రపంచకప్‌లో అద్భుతమైన ప్రదర్శనతో.. అజేయ రికార్డు కొనసాగిస్తూ భారత్ ఫైనల్ చేరింది. ఆదివారం తుదిపోరులో ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దృష్టంతా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం మీదకు మళ్లింది. ప్రపంచంలోనే పెద్దదైన ఈ క్రికెట్ స్టేడియంలో లక్షా 32 వేల మంది ప్రేక్షకులు మ్యాచ్ చూసే అవకాశముంది. 1982లో సర్దార్ పటేల్ స్టేడియంగా 54 వేల సీటింగ్ సామర్థ్యంతో ఇది ప్రారంభమైంది. మొతేరా స్టేడియంగానూ ప్రసిద్ధికెక్కింది. పాత స్టేడియం స్థానంలో కొత్త దాని నిర్మాణం 2015లో ప్రారంభించారు. ప్రపంచంలోనే అతి పెద్దదిగా మారిన ఈ స్టేడియాన్ని 2021లో పునఃప్రారంభించారు. ఈ మైదానంలో మొత్తం 11 పిచ్‌లున్నాయి. టెస్టు క్రికెట్లో సునీల్ గావస్కర్ 10 వేల పరుగుల మైలురాయిని చేరుకుంది ఇక్కడే. టెస్టుల్లో 432వ వికెట్‌తో అప్పుడు అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కపిల్ దేవ్ రికార్డు సృష్టించింది కూడా ఇక్కడే. ఇక్కడ 1987, 1996 ప్రపంచకప్‌ల్లో ఒక్కో మ్యాచ్ జరిగింది. 2011 ప్రపంచకప్‌లో మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చింది. వన్డేల్లో 18 వేల పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా సచిన్ ఇక్కడే చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో సచిన్ తొలి డబుల్ సెంచరీని ఇక్కడే సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్లో 20 ఏళ్ల కెరీర్‌ను, 30 వేల పరుగులను ఇక్కడే పూర్తిచేసుకున్నాడు.

**అజేయంగా..** ఈ స్టేడియంలో ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో భారత ఇప్పటివరకూ ఓడిపోలేదు. 1987లో జింబాబ్వేపై 7 వికెట్ల తేడాతో గెలిచింది. 2011 ప్రపంచకప్ క్వార్టర్స్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. ఈ ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. ఇప్పుడదే జోరు కొనసాగించి ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించాలనే భారత్ చూస్తోంది. ఓవరాల్‌గా ఇక్కడ ఇప్పటివరకూ 18 వన్డేలు ఆడిన భారత్ 10 మ్యాచ్‌ల్లో గెలిచి, 8 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. రికార్డులు చూస్తే అక్కడ అత్యధిక స్కోరు దక్షిణాఫ్రికా (2010లో భారత్‌పై 365/2) చేసింది. అత్యధిక పరుగులు ద్రవిడ్ (342), అత్యధిక వికెట్లు కపిల్ దేవ్ (10) సాధించారు. ఇక్కడి పిచ్ బ్యాటింగ్, బౌలింగ్‌కు సమానంగా సహకరించే అవకాశముంది. నల్లమట్టి పిచ్‌పై ఫైనల్ జరిగే అవకాశముంది. ఈ టోర్నీలో జట్లు 400 పరుగులు చేసినా విజయంపై ధీమాగా ఉండలేని పరిస్థితి. కానీ ఈ ఫైనల్లో 315 పరుగుల స్కోరును కాపాడుకోవచ్చని స్థానిక క్యూరేటర్ చెప్పారు. మరోవైపు స్పిన్ పిచ్ రూపొందిస్తున్నారని, ఫైనల్లో సిరాజ్ స్థానంలో అశ్విన్‌ను ఆడించే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మంచి బౌన్స్ లభించి ఇక్కడి పిచ్ సాధారణంగా పేసర్లకే ఎక్కువ అనుకూలమనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో జోరుమీదున్న మన పేస్ త్రయం మరోసారి చెలరేగి జట్టును విశ్వవిజేతగా నిలపాలని అభిమానులు కోరుకుంటున్నారు. వాంఖడే సరసన నరేంద్ర మోదీ స్టేడియం చేరాలని ఆకాంక్షిస్తున్నారు.




## పాలస్తీనీయులకు ఇజ్రాయెల్ తాజా హెచ్చరికలు

ఖాన్ యూనిస్: హమాస్‌ను అంతం చేయడమే లక్ష్యంగా ఉత్తర గాజాలో భీకర దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్.. ఇప్పుడు దక్షిణ గాజాపై దృష్టిపెట్టింది. ఈ ప్రాంతంలోని పాలస్తీనీయులు తక్షణమే పశ్చిమ ప్రాంతానికి పారిపోవాలని తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ గాజాపైనా ముమ్మర దాడులకు సిద్ధమైన ఐడీఎఫ్.. పౌరులు తరలిపోవాలని ఆదేశాలిచ్చింది. ఇప్పటికే దక్షిణ గాజాలోని కొన్ని ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడి చేసింది. "ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించాం. ఇది అంత సులభం కాదని మాకు తెలుసు. అయితే, ఎదురుకాల్పుల్లో పౌరులు చిక్కుకోకూడదని మేం భావిస్తున్నాం" అని ఇజ్రాయెల్ అధికారి ఒకరు వెల్లడించారు. దక్షిణ గాజా నగరమైన ఖాన్ యూనిస్‌లో 4లక్షల వరకు జనాభా ఉంటారు. దీనికి తోడు.. ఇటీవల ఉత్తర గాజాలో ఇజ్రాయెల్ విరుచుకుపడటంతో అనేక మంది దక్షిణ ప్రాంతానికి వలస వచ్చారు. ఇప్పుడు వీరందరినీ పశ్చిమ ప్రాంతానికి తరలి వెళ్లాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు చేసింది. అక్కడైతే మానవతా సాయం పొందేందుకు సులువుగా ఉంటుందని పేర్కొంది. దీంతో మళ్లీ వలసబాట పట్టక తప్పేలా లేదని పాలస్తీనీయులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

**చిన్నారుల మృతి..** శనివారం తెల్లవారుజామున ఖాన్ యూనిస్ నగరంలోని ఓ ప్రాంతంపై ఇజ్రాయెల్ బాంబు దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 26 మంది మరణించినట్లు పాలస్తీనా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇందులో అత్యధికులు చిన్నారులేనని పేర్కొన్నాయి.

**పిల్లల స్కూల్‌లో రాకెట్లు, గ్రనేడ్లు..** మరోవైపు, ఉత్తర గాజాలో అణువణువు తనిఖీలు చేస్తున్న ఐడీఎఫ్ దళాలు.. హమాస్ స్థావరాలను బట్టబయలు చేస్తున్నాయి. తాజాగా ఓ కిండర్‌గార్డెన్, ఎలిమెంటరీ స్కూల్‌లో ఇజ్రాయెల్ బలగాలు పెద్ద ఎత్తున ఆయుధాలను గుర్తించాయి. మోర్టార్ షెల్స్, రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్లు, ఇతర మారణాయుధాలను హమాస్ ఈ స్కూళ్లలో భద్రపర్చినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. అందుకు సంబంధించిన వీడియోలను విడుదల చేసింది.




వన్డే ప్రపంచకప్ టైటిల్‌కు టీమ్‌ఇండియా మరో అడుగుదూరంలో ఉంది. లీగ్ దశలో 9 మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన రోహిత్ సేన.. సెమీస్‌లో కివీస్‌ను ఓడించి ఫైనల్ చేరుకుంది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియాకు భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ పలు సూచనలు చేశాడు. భారత జట్టు దుర్భేద్యంగా కనిపిస్తోందని, అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో భారత్.. ఆస్ట్రేలియాను ఓడించి టైటిల్ గెలవాలని ఆకాంక్షించాడు. ఇప్పటివరకు టోర్నీలో రోహిత్ సేన అద్భుతంగా ఆడిందని, ఇదే ఆటతీరును ఫైనల్‌లో కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదని గంగూలీ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా కూడా పటిష్ఠంగా ఉండటంతో మ్యాచ్ ఆసక్తికరంగా ఉంటుందన్నాడు.

**ఫైనల్ మ్యాచ్.. ప్రత్యేక కార్యక్రమాలు :**
ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు ప్రపంచంలోనే అతిపెద్దదైన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రపంచకప్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. టాస్ వేసిన అనంతరం 1: 35 గంటల నుంచి 1:50 వరకు భారత వాయుసేన ఆధ్వర్యంలోని సూర్యకిరణ్ ఎయిర్‌బాటిక్ బృందం ఎయిర్‌షో చేయనుంది. మొదటి ఇన్సింగ్స్ డ్రింక్స్ విరామంలో ప్రముఖ నేపథ్య గాయకుడు, గేయ రచయిత ఆదిత్య గద్వీతో సంగీత కార్యక్రమం, తొలి ఇన్నింగ్స్ విరామ సమయంలో ప్రీతమ్, జోనితా గాంధీ, తుషార్ జోషి తదితరుల నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండో ఇన్నింగ్స్ విరామ సమయంలో లేజర్, లైట్ షో ఉంటుంది.

**మ్యాచ్ కోసం ప్రత్యేక రైళ్లు :** ప్రపంచ కప్ ఫైనల్‌ను దృష్టిలో ఉంచుకుని అభిమానుల సౌకర్యార్థం అహ్మదాబాద్‌కు భారత రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. శనివారం ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక రైలును నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదివారం రాత్రి మ్యాచ్ ముగిసిన మ్యాచ్ తర్వాత రైలు అహ్మదాబాద్ నుంచి తెల్లవారుజామున 2:30 గంటలకు ఢిల్లీకి బయలుదేరుతుంది. ముంబయి – అహ్మదాబాద్ మధ్య కూడా మ్యాచ్ కోసం మూడు రైళ్లను ఏర్పాటు చేశారు.

## కార్పొరేట్ స్కూళ్ల కంటే ఏపీ ప్రభుత్వ బడులు అద్భుతం: అంబటి రాయుడు





తెనాలి : కార్పొరేట్ స్కూళ్ల కంటే ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు కొనియాడారు. తెనాలి నియోజకవర్గం సంగం జాగర్లమూడిలోని రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ పాఠశాలను రాయుడు పరిశీలించారు. విద్యార్థులు కూడా తమ భవిష్యత్తు బాగుంటుందని నమ్మకంతో ఉన్నారని తెలిపారు. 'ఏపీలో స్కూళ్లలో ఉన్న సదుపాయాలు దేశంలో ఎక్కడా లేవు. మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చే ఆహారం రుచికరంగా ఉంది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ఏపీ నెంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. వైద్య ఆరోగ్య రంగంలో ఏ రాష్ట్రం మన రాష్ట్రంతో సరితూగలేదు. రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులు ఆనందంగా ఉన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమం. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు సంక్షేమ పథకాలతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారు' అని రాయుడు అన్నారు.

## కులగణన లక్ష్యం ఏంటి.. వైసీపీ స్కెచ్ ఇదేనా..!



అమరావతి : రాష్ట్రంలో వైసీపీ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కార్యక్రమం కుల గణన. దీనిని ఈ నెల 27 నుంచి ప్రారంభించనున్నట్టు ముందు ప్రకటించారు. అయితే.. కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కులగణన అభిప్రాయ సేకరణ సదస్సులు జరుగుతున్నాయి. ఈ సదస్సులకు అన్నివర్గాకు చెందిన కుల సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. ఇక, ప్రతిపక్ష నాయకులకు కూడా ఆహ్వానాలు ఉన్నాయని చెబుతున్నా.. వారెవరూ రావడం లేదు. ఇదిలావుంటే.. వైసీపీ నేతల మధ్య జరుగుతున్న చర్చ మేరకు.. అసలు కుల గణన లక్ష్యమేంటి? అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఇటీవల బిహార్‌లో చేపట్టిన కుల గణన మేరకు అక్కడ 65 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇక, ఇప్పుడు బిహార్ తర్వాత.. కుల గణన చేపట్టిన మూడో రాష్ట్రం ఏపీనే. రెండో రాష్ట్రం ఛత్తీస్‌గఢ్(కాంగ్రెస్ పాలిత రాష్ట్రం). అక్కడి మాదిరిగా ఇక్కడ కూడా 65 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రకటన ఏమైనా ఉందా? అనేది ప్రధాన చర్చ. దీనికి కారణం.. వచ్చే ఎన్నికల్లో బీసీ ఓటు బ్యాంకు కీలకంగా మారింది. ఇటీవల ముసాయిదా ఎన్నికల ప్రకటలోనూ బీసీ ఓటు బ్యాంకు రాష్ట్ర వ్యాప్తంగా 8-12 లక్షల వరకు పెరిగింది. ఇది చాలా కీలకమైన ఓటు బ్యాంకు కావడంతో వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ సాగుతోంది. ఇదే విషయాన్ని టీడీపీ కూడా చెబుతోంది. బీసీలను ఓటు బ్యాంకుగా మార్చుకునే వ్యూహంలో భాగంగానే కుల గణనకు తెరదీశారనేది ఈ పార్టీ వాదన. ఇక, వైసీపీ విషయానికి వస్తే.. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు.. కార్యక్రమాలను సాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన వారికి అందించాలనే వ్యూహంతోనే బీసీ గణనను చేపడుతున్నట్టు చెబుతున్నారు. కానీ, వాస్తవానికి ఎన్నికలకు ముందు చేపడుతున్న బీసీ గణన ద్వారా వైసీపీ చాలా పక్కా ప్లాన్‌తోనే ముందుకు సాగుతోందని అంటున్నారు పరిశీలకులు. తద్వారా బీసీలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న కలను సాకారం చేసినట్టు అవుతుందని, ఇది ఎన్నికల సీజన్‌లోతమకు కలిసి వచ్చే అవకాశం ఉంటుందని వైసీపీ నాయకులు అంచనా వేస్తున్నారు.

# కోటబొమ్మాళి.. ఎలా ఉంటుందంటే..

గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ నుంచి వస్తున్న కోట బొమ్మాళి పీఎస్ సినిమా ప్రస్తుతం వార్తల్లో ఎక్కువగా నిలుస్తోంది. సినిమా నుంచి వస్తున్న సాంగ్స్ అప్డేట్స్ మంచి బజ్ క్రియేట్ చేస్తున్నాయి. రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో నటించగా 'అర్జున ఫల్గుణ' ఫేమ్ తేజ దీన్ని తెరపైకి తీసుకు వస్తున్నాడు. ఇక టాలెంటెడ్ సీనియర్ హీరో శ్రీకాంత్ ఇందులో కీలకమైన పాత్రలో నటించగా మరో స్టార్ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్ర పోషించారు. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్ అలాగే విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా. నవంబర్ 24న థియేటర్లలో విడుదల అవుతోంది. ఇక వరలక్ష్మీ శరత్ కుమార్ లేటెస్ట్ గా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమా విశేషాలు పంచుకున్నారు. వరలక్ష్మి మాట్లాడుతూ.. నా సినిమా జర్నీలో ఈ మధ్య ఎక్కువ పోలీస్ పాత్రలలో నటించే అవకాశం వస్తోంది. ఇప్పటికే కోలీవుడ్ లో చాలా చేశాను. అయితే తెలుగు ఆడియెన్స్‌కు మాత్రం



ఫస్ట్ టైమ్ పోలీస్ పాత్రలో కనిపిస్తున్నా. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ ట్రెండ్ జానర్ లలో ఎక్కువగా సినిమాలు వస్తున్న టైమ్ లో ఈ సినిమా కూడా బాగా ఆకట్టుకుంటుంది అనే నమ్మకం ఉంది. ఈ సినిమా కాన్సెప్ట్ డిఫరెంట్‌గానే ఉంటుంది. తెలుగు ఆడియెన్స్ కు కొత్తగా కనిపించాలని చాలా ట్రై చేస్తున్నా. నేను కథను హీరోగా భావిస్తాను. శ్రీకాంత్ గారు ఒక పోలీస్ ఆఫీసర్ తీరు బాగుంది. ఇక ఇద్దరిలో ఒకరు క్రిమినల్ అయితే ఎలా ఉంటుంది.. అసలు పోలీసులపై పొలిటికల్ ఒత్తిడి ఏ విధంగా ఉంటుందనేది అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. కోట బొమ్మాళి క్యాట్ అండ్ మౌస్ గేమ్ తరహాలో థ్రిల్ చేస్తుంది. ముఖ్యంగా స్క్రీన్‌ప్లే ఆసక్తికరంగా ఉంటుంది. ఎలక్షన్ టైమ్‌లోనే ఇలాంటి మంచి కథలు వస్తుండడం విశేషం. అలాగే ఓటు గురించి అవగాహన కల్పించేలా లైన్ కూడా ఈ కథలో ఉంది. 'నాయట్టు'కి రీమేక్ అయినప్పటికి చాలా మార్పులు చేశారు. ఇక క్యారెక్టర్ రన్ టైమ్ ఎక్కువే. లేడీ ఓరియంటెండ్ సినిమాలతో పాటు క్యారెక్టర్ నచ్చితే ఎలాంటి సినిమాల్లో అయినా నటించడానికి రెడీ. ఇక నేను నటించిన సినిమాలలో సంక్రాంతికి హనుమాన్ రాబోతోంది. అలాగే కన్నడలో సుదీప్‌తో కలిసి మ్యాక్స్ సినిమాలో నటిస్తున్నా. ఇక ప్రాజెక్టులు లైన్‌లో ఉన్నాయి. త్వరలోనే వాటిపై క్లారిటీ వస్తుంది.. అని వరలక్ష్మీ శరత్ కుమార్ వివరణ ఇచ్చారు.

# ఆ దేవుడిచ్చిన ఊహించని రంగుల జీవితం నాది!

ప్రియా వారియర్ కెరీర్ లో ఇప్పుడెంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. సౌత్ సినిమాలు కూడా కాదు. ఏకంగా బాలీవుడ్ సినిమాలే చేస్తోంది. ప్రస్తుతం అమ్మడి లైనప్ లో చాలా సినిమాలు న్నాయి. వచ్చిన ఏ అవకాశం విడిచిపెట్టలేదు. అలాగని సౌత్ ని లైట్ తీసుకోలేదు. ఇక్కడా అందివచ్చిన అవకాశాలు అందు కుంటుంది. కానీ అమ్మడి టార్గెట్ మాత్రం హిందీ ఇండస్ట్రీపైనే కనిపిస్తుంది. అక్కడ మార్కెట్ లో ఎలాగైనా నిలదొక్కుకోవాలని గట్టి ప్రయత్నాలు చేస్తోంది. మరి ఈరకమైన జీవితాన్ని ప్రియావారియర్ ఊహించిందా? అసలు తాన స్టార్ అవుతానని కలలోనైనా అనుకుందా? అంటే లేదనే చెప్పాలి. ఈ మాట స్వయంగా ప్రియావారియర్ చెప్పింది. 'చిన్న తనం నుంచి



సినిమాలంటే ఆసక్తి ఉంది. అదే ఇంట్రెస్ట్ తో సినిమా చూసొచ్చి అద్దం ముందు ప్రాక్టీస్ చేసేదాన్ని. కానీ నేను నటిని అవుతానని నా తల్లిదండ్రులే కాదు ..నేను కూడా ఊహించలేదు. చదువుకుంటోన్న సమయంలోనే ఆడిషన్ కి వెళ్లా. ఆ సినిమా పూర్తిచేయడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించారు' అంది. మలయాళ చిత్రం 'ఒరు ఆదార్ లవ్' లో అమ్మడు నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా ఫ్లాప్ అయినా అందులో ట్రైలరే ప్రియా వారియర్ ని దేశ వ్యాప్తంగా పాపులర్ చేసింది. ఒక్క కన్ను గీటుతో యువతలో క్రేజీ భామగా మారిపోయింది. ఆ గీటుకు కుర్రాళ్లే కాదు...చాలా మంది సెలబ్రిటీ హీరోలు కూడా పిదా అయ్యారు. ఆ వీడియో నెట్టింట సంచలనం సృష్టించింది. ఆ వీడియోతోనే ప్రియా వారియర్ అంటే దే శవ్యాప్తంగా అందిరికీ తెలిసిందే. ఆ క్రేజ్ తోనే సినిమాల్లో అవకాశాలు రావడంతో నేడు రంగుల జీవితాన్ని ఆస్వాదిస్తుంది. కోట్లలో పారితోషికంగా తీసుకుంటుంది. ఖరీదైన కార్లు...అపార్ట్ మెంట్లు కొనుగోలు చేసింది. తాను ఏమాత్రం ఊహించని జీవితం తనకి దక్కింది. ఇలాంటి జీవితం ఉండాలంటే నిజంగా పెట్టి పుట్టాలి.




# రాజు యాదవ్ చూడు.. ఊర మాస్ లవ్




జబర్దస్త్ షో ద్వారా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న గెటప్ శ్రీను ఆ తరువాత సినిమాల్లో చిన్నపాటి క్యారెక్టర్స్ చేస్తూ మెల్లగా తన క్రేజ్ పెంచుకుంటూ వస్తున్నాడు. పొలిమేర లాంటి సినిమాల్లో అతను చేస్తున్న పాత్రలకు కూడా మంచి గుర్తింపు అందింది. గెటప్ శ్రీను ఎలాంటి పాత్రలో అయినా నటించగలడు అని నిరూపించారు. ఇక ఇప్పుడు అతను కథానాయకుడిగా రాజు యాదవ్ అనే సినిమా చేస్తున్నాడు.

రాజు యాదవ్ సినిమాను కృష్ణమాచారి డైరెక్ట్ చేశారు. ఫుల్ ఎంటర్‌టైనర్‌తో గా రాబోతున్న ఈ సినిమాను సాయి వరుణవి క్రియేషన్స్ చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై కె. ప్రశాంత్ రెడ్డి మరియు రాజేష్ కల్లేపల్లి కలిసి ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు మంచి ఆదరణ లభించింది. ఇక సినిమా యూనిట్ మొదటి సింగిల్ ను రిలీజ్ చేశారు. రాజు యాదవ్ చూడు.. అనే ఈ పాటను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ లాంచ్ చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకత్వంలో మెలోడీని అందించగా, రామ్ మిరియాల తన అద్భుతమైన గానంతో పాటకు మరింత ప్రాణం పోశారు. ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ ఈ పాటకు రచన చేశారు. అంకితా ఖరత్ ఈ సినిమాలో.హీరోయిన్ గా నటించింది. ఇక గెటప్ శ్రీను తన అమ్మాయికి కథానాయకుడుగా తన ప్రేమను వ్యక్తపరిచినట్లు ఈ పాటలో చూపించారు. ఈ పాటలో విజువల్స్ చాలా అందంగా ఉన్నాయి, దీనికి తక్షణ స్పందన వస్తుంది. ప్రేమ మరియు కామెడీతో పాటు, సినిమాలో హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో.ఉండబోతున్నాయట.

ఇక మేకర్స్ రాజు యాదవ్ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ ఫార్మాలిటీస్ పూర్తి చేసారు. ఇక త్వరలోనే మేకర్స్ విడుదల తేదీని ఎనౌన్స్ చేయనున్నారు. ఈ సినిమాలో గెటప్ శ్రీను, అంకిత ఖరత్ జంటగా నటించగా.. ఆనంద చక్రపాణి, రాకెట్ రాఘవ ముఖ్యమైన పాత్రల్లో నటించారు. ఇక మిర్చి హేమంత్, జబర్దస్త్ సన్నీ, సంతోష్ కల్వచెర్ల, శ్రీరామ్, కళ్యాణ్ భూషణ్, శ్రీమణి, పవన్ రమేష్, ఉత్తర ప్రశాంత్ తదితరులు కూడా ఈ సినిమాలో నటించారు.

# రొమాన్స్ లో పీసీనే శ్రుతిహాసన్ బీట్ చేస్తుందా?





టాలీవుడ్..కోలీవుడ్..బాలీవుడ్ లో అలరించిన శ్రుతిహాసన్ ఇప్పుడు హాలీవుడ్ లోనూ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. అమ్మడు 'ది ఐ' చిత్రంతో తెరంగేట్రం చేస్తోంది. వైవిధ్యమైన పాత్రలు పోషించడం అంటే శ్రుతికి ఎంతో ఆసక్తి. ఈనేపథ్యంలో హాలీవుడ్ లోనూ అలాంటి అటెంప్ట్ చేస్తోంది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ లో శ్రుతి హాసన్ కి జోడీగా మార్క్ రౌలీ నటిస్తున్నారు. ఇందులో ఇద్దరు భార్యాభర్తల పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే శ్రుతి హాసన్ రోల్ ఎలా ఉంటుందన్నది రివీల్ అయింది. ఓ సాహసపేతమైన పాత్రలోనే కనిపిస్తుంది. చనిపోయిన భర్త అస్తికల్ని ఓ ద్వీపంలో కలిపేందుకు ఒంటరిగా ఆమె ఎలా ప్రయాణం చేసింది? భర్త మరణానికి కారణం ఎవరు? అనే తెలుసుకునే ప్రక్రియలో ఆమె ఎలాంటి అవరోధాలు ఎదుర్కుంది? అన్నది ఆసక్తికరం. ఇది శ్రుతిహాసన్ పాత్రకి సంబంధించి ఒకవైపు మాత్రం. నాణేనికి మరోవైపు అన్నట్లు శ్రుతి సినిమాలో రొమాంటిక్ సన్నివేశాల్లోనూ చెలరేగిందని టాక్. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాల్లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే మించిపోయిందా? అంటే అవుననే ప్రచారం తెరపైకి వస్తోంది. శ్రుతిహాసన్ భార్యపాత్రని అత్యంత రొమాంటిక్ గానూ మలుస్తున్నట్లు సమాచారం. మార్క్ రౌలీతో అమ్మడు ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ చెలరేగిందని కోలీవుడ్ లో గుసగుసలు మొదలయ్యాయి. భర్తతో బెడ్ రూమ్ సన్నివేశాలు రక్తికట్టించడంలో శ్రుతి హాసన్ ఏమాత్రం వెనకడుగు వేయలేదని టాక్ వినిపిస్తుంది. 'క్వాంటికో' సిరీస్ లో కదిలే కారులో పీసీ రొమాన్స్ చేస్తే ...శ్రుతి హాసన్ మాత్రం బెడ్ రూమ్ లోనే కావాల్సినంత రొమాన్స్ ని పండించిందని ప్రచారం సాగుతోంది. పాత్ర కోసం శ్రుతిహాసన్ పరిమితులు విధించే నటికాదు. పైగా ఇది హాలీవుడ్ సినిమా కాబట్టి సినిమాలో ఇంటిమేట్ సన్నివేశాలు తప్పనిసరని ఎలాగూ తెలుసు. అన్ని తెలిసిన శ్రుతి హాసన్ కొత్తగా నో చెప్పడానికి ఆస్కారం లేదని తెలుస్తుంది. మరి ఇందులో నిజమెంతో? ది ఐ రిలీజ్ తోనే క్లారిటీ వస్తుంది. ఈ చిత్రానికి డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహిస్తున్నాడు. దీంతో పాటు శ్రుతి హాసన్ తెలుగులో 'సలార్' లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. డిసెంబర్ లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే నాని హీరోగా నటిస్తోన్న 'హాయ్ నాన్న'లోనూ నటిస్తోంది.

# 'యానిమల్' లో రష్మిక... ఇంట్రెస్టింగ్ అప్‌డేట్

తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో హిందీలో రూపొందిన యానిమల్ సినిమా విడుదలకు సిద్ధం అయింది. రణబీర్ కపూర్ హీరోగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా రూపొందిన ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకంతో మీడియా వర్గాల వారితో పాటు అంతా కూడా ఉన్నారు. యానిమల్ సినిమా లో రణబీర్ కపూర్ పాత్ర తో పాటు ప్రతి ఒక్క పాత్ర కూడా చాలా స్పెషల్ గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ముఖ్యంగా హీరోయిన్ రష్మిక మందన్న పాత్ర ఇంకా ఆమె నటన సినిమాకు ప్రధాన ఆకర్షణ అన్నట్లుగా నిలవబోతోంది అంటున్నారు. పలు ఎమోషనల్ సన్నివేశాల్లో రష్మిక నటించిందట. ముఖ్యంగా రణబీర్



కపూర్ ప్రవర్తన వల్ల ఆయన భార్య అయిన రష్మిక మందన్న చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటుందట. ఆ సన్నివేశాల్లో రష్మిక జీవించినట్లు ఉంటుందని తెలుస్తోంది. రష్మిక తన అందాల ఆరబోతతో ఇప్పటి వరకు కెరీర్ ను నెట్టుకు వస్తుంది అంటూ ట్రోల్స్ చేసే వారికి ఈ సినిమాలోని తన నటనతో సమాధానం ఇవ్వబోతుందట. మరో వైపు రష్మిక మందన్న తెలుగు లో పుష్ప 2 సినిమాలో కూడా నటిస్తోంది. మొదటి పార్ట్ లో పెద్దగా నటించేందుకు స్కోప్ దక్కలేదు. పాటలు, స్కిన్ షో తో మెప్పించింది. ఇక సెకండ్ పార్ట్ లో పుష్ప భార్య పాత్ర లో రష్మిక నటనకు ఆస్కారం ఉంటుందట. కనుక యానిమల్ మరియు పుష్ప 2 లతో రష్మిక కుమ్మేయడం ఖాయం అనిపిస్తోంది.

# వైట్ బ్లాక్ ఔట్ ఫిట్ లో కన్నుల విందు

ఉత్తరాది ప్రేక్షకులను బుల్లి తెర ద్వారా మొదట ఎంటర్ టైన్ చేసిన మృణాల్ ఠాకూర్ అక్కడ నుంచి వెండి తెరపై అడుగు పెట్టింది. బుల్లి తెర నుంచి వెండి తెర పై అడుగు పెట్టినా కూడా అందాల ఆరబోత విషయంలో ఏమాత్రం తగ్గేది లేదు అన్నట్లుగా షో చేస్తూనే ఉంది. టాలీవుడ్ లో సీతారామం సినిమా తో అడుగు పెట్టింది. ప్రస్తుతం నానితో ఒక సినిమాను చేయడంతో పాటు సౌత్ లో పలు సినిమాలకు ఇప్పటికే సైన్ చేసింది. బాలీవుడ్ లో కూడా ఈమె వరుస సినిమాలతో జోష్ మీద ఉంది. ఒక వైపు సినిమాల్లో బిజీ బిజీగా నటిస్తూ ఆకట్టుకుంటూ ఉంది. మరో వైపు ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ తో రెచ్చి పోతూ ఉంది. తాజాగా వైట్ బ్లాక్ డ్రెస్ లో కన్నుల



విందు చేసింది. సాధారణంగా వైట్ డ్రెస్ లో ముద్దుగుమ్మలు ఏంజిల్స్ మాదిరిగా ఉంటారు. బ్లాక్ డ్రెస్ చాలా కొద్ది మందికి మాత్రమే నప్పుతాయి. అలాంటిది మృణాల్ ఠాకూర్ కి బ్లాక్ డ్రెస్ అదిరింది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ బ్లాక్ డ్రెస్ లో కన్నుల విందు చేస్తున్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బ్లాక్ డ్రెస్ లో టాప్ లేపేసిన మృణాల్ ఠాకూర్ మ్యాడ్ ఫోజ్ లు ఇస్తూ అలరిస్తోంది. బ్లాక్ వెల్వెట్ డ్రెస్ లో ఈ అమ్మడు భలే ముచ్చటగా ఉందంటూ ఆమె ఫ్యాన్స్ తో పాటు అంతా కూడా కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తే ముందు ముందు మరిన్ని సినిమాల్లో హాట్ పాత్రల్లో నటించే అవకాశాలు ఉన్నాయి.




## కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.2వేలు పింఛను ఇస్తే.. ముక్కు నేలకు రాస్తా: కేసీఆర్

చేర్యాల: పదేళ్ల అధికారంలో ఉన్న భారాస ఏం చేసిందో గమనించాలని భారాస అధినేత, సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాలలో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. "ఎన్నికలు రాగానే ప్రజలు ఆగం కాకూడదు. తెలివితో ఓటు వేస్తేనే తెలివైన ప్రభుత్వం వస్తుంది. రాష్ట్రం తలరాతను మార్చే ఓటును వివేకంతో వేయాలి. ఉన్న తెలంగాణను ఆంధ్రలో కలిపి 58 ఏళ్ల గోస పెట్టిందే కాంగ్రెస్. ఎంతో పోరాటం చేసి తెలంగాణను మళ్లీ సాధించుకున్నాం. పదేళ్ల క్రితం తెలంగాణ ఎలా ఉండేదో గుర్తు చేసుకోవాలి. గతంలో తెలంగాణలో ఎక్కడ చూసినా కరవు ఉండేది. సాగునీరు, తాగునీరు, కరెంటు కష్టాలు ఎన్నో ఉండేవి. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పం. కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవం%) అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడైనా రూ.2వేలు పింఛను ఇస్తున్నారా? కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.2వేల పింఛను ఇస్తున్నట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా. తెలంగాణకు వచ్చి మాత్రం కాంగ్రెస్ నేతలు రూ.4వేలు పింఛను ఇస్తామని చెబుతున్నారు. మళ్లీ భారాస గెలిస్తే.. పింఛన్లు క్రమంగా రూ.5వేలకు పెంచుతాం. 50 ఏళ్లలో కాంగ్రెస్ వాళ్లు ఎన్ని వాగ్దానాలు చేసి విస్మరించారో మనం చూడలేదా? రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పించిందే కాంగ్రెస్. తెలంగాణలో వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. నీటి తీరువా రద్దు చేశాం. 24 గంటల విద్యుత్ ఇస్తున్నాం. రైతు బంధు ఇస్తున్నాం. రూ.5లక్షల రైతు బీమా ఇస్తున్నాం. రైతులు పండించిన పంటనంతా గ్రామాల్లోనే కొనుగోలు చేస్తున్నాం. ఇప్పుడిప్పుడే రైతుల ముఖాల్లో చిరునవ్వు చూస్తున్నాం. ఇంకో పదేళ్ల పాలన ఇలాగే ఉంటే రైతులంతా బాగుపడతారు. సంపద పెరిగే కొద్దీ సంక్షేమ పథకాలు పెంచుకుంటూ పోతున్నాం. జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిస్తే రైతు బంధు రూ.16వేలు వస్తాయి. అదే కాంగ్రెస్ వాళ్లు గెలిస్తే ఉన్న రైతు బంధు కూడా పోతుంది. ఇవన్నీ ప్రజలు గమనించాలి. 50ఏళ్ల పాలనలో కాంగ్రెస్ తెలంగాణను కరవు ప్రాంతంగా తయారు చేసింది. ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా 24 గంటల కరెంటు ఇవ్వడం లేదు. నన్ను చూసి కాంగ్రెస్, భాజపా భయపడుతున్నాయి. రాష్ట్రానికే పరిమితం చేయాలని చూస్తున్నాయి. రాష్ట్రంలో నేను గెలిస్తే మహారాష్ట్రకు వెళ్తానని భయపడుతున్నారు. అందుకే నన్ను ఓడించేందుకు భాజాపా, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి. రైతులకు 3గంటల కరెంటు చాలని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఇవాళ పంజాబ్‌ను తలదన్ని 3కోట్ల టన్నుల ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. మల్లన్నసాగర్ ప్రాజెక్టు 50 టీఎంసీలతో నిండుకుండలా ఉన్నది. టపాస్‌పల్లి రిజర్వాయర్‌కు రూ.50కోట్లు మంజూరు చేశాం.. కాలువ, పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. అది పూర్తయితే.. చేర్యాల ఏరియాలో కరవు అనేది అడుగుపెట్టదు. " అని సీఎం కేసీఆర్ వివరించారు.




బోధన్: అమలుకు సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ నేతలు మేనిఫెస్టో విడుదల చేశారని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్ తిప్పలు తప్ప అభివృద్ధి ఉండదని ఆరోపించారు.

నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి భారాసతోనే సాధ్యమని చెప్పారు. "కాంగ్రెస్ నేతలు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. ఆ పార్టీ మేనిఫెస్టోను నమ్మి ప్రజలు మోసపోవద్దు. కర్ణాటక ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇంతవరకు నెరవేర్చలేదు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామా? అని ప్రజలు బాధపడుతున్నారు. రైతుబంధు, రైతుబీమాతో భారాస ప్రభుత్వం రైతులను ఆదుకుంటోంది.

200 ఉన్న పింఛన్‌ను 2వేలు చేశాం. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు 3వేలు ఇస్తాం. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తాం" అని హరీశ్‌రావు వెల్లడించారు.

# తెలంగాణలో కుటుంబ పాలన నడుస్తోంది



గద్వాల: జోగులాంబ శక్తి పీఠం కోసం మోదీ సర్కార్ 70 కోట్లు ఇస్తే కేసీఆర్ ప్రభుత్వం ఆ నిధులను ఖర్చు చేయలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. శనివారం నాడు అమిత్ షా గద్వాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.."కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదు. గుర్రం గడ్డ వంతెన, గట్టులిఫ్ట్, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం కేసీఆర్ కేంద్రం దృష్టికి తీసుకు రాలేదు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తక్షణమే అమలు చేస్తాం. 52 శాతం బీసీ ఓటర్లు 130 కులాలున్న బీసీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తోంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం. బీసీలకు బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం 3,300 కేటాయిస్తే.. కేసీఆర్ 77 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. టీఎస్పీఎస్సీ పరీక్షల రద్దు, పేపర్ లీక్‌లతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారు. ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుతాం. ముస్లిం మతపర రిజర్వేషన్లు రద్దు చేస్తాం. దేశంలో, రాష్ట్రంలో 2జీ, 3జీ, 4జీ కుటుంబ పాలన నడుస్తోంది. 2జీ కేసీఆర్ – కేటీఆర్, 3జీ ఓవైసీ మూడు తరాలు, 4జీ గాంధీ 4 తరాలు దేశాన్ని, రాష్ట్రాన్ని ఎలాయి. తెలంగాణలో బీఆర్ఎస్‌కు విముక్తి కల్పించండి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి మయంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని 70ఏళ్లు నాన్చింది. జనవరి 22వ తేదీన అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ జరగనుంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రజలందరికీ అయోధ్య దర్శనం ఉచితంగా కల్పిస్తాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

# జగిత్యాల ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన కవిత



జగిత్యాల: ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అస్వస్థతకు గురయ్యారు. ఎన్నికల ప్రచార రథంలోనే కవిత కళ్లు తిరిగి పడిపోయారు. ఇటిక్యాల రోడ్‌షోలో ఎమ్మెల్సీ కవిత స్పృహతప్పిపడిపోయారు. డిహైడ్రేషన్ కారణంగా స్వల్ప అస్వస్థతకు కవిత గురయ్యారు. విశ్రాంతి తీసుకునే క్రమంలో అక్కడ చిన్నారితో కవిత ముచ్చటించారు. దీనిపై కల్వకుంట్ల కవిత "ఎక్స్" లో స్పందిస్తూ ... "నేను ఆరోగ్యంగానే ఉన్నాను. చిన్నారితో కాసేపు ముచ్చటించిన తర్వాత మరింత ఉత్సాహం వచ్చింది. ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నాను" అని పేర్కొన్నారు. చిన్నారితో ముచ్చటిస్తున్న వీడియోను ఆమె పోస్ట్ చేశారు. డిహైడ్రేషన్ కారణంగా స్వల్ప అస్వస్థతకు గురై కాసేపు విశ్రాంతి తీసుకున్న కల్వకుంట్ల కవిత ప్రచారాన్ని యధావిధిగా కొనసాగించారు.

# పొంగులేటి, నేను శత్రువులం కాదు.. ఇద్దరం ఒక్కటేనన్న తుమ్మల




భద్రాచలం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో.. అశ్వారావుపేట నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుల ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తుమ్మల ఆసక్తికర కామెంట్స్ చేశారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన పూజ్యులు ఎన్టీఆర్ అని.. ఆంధ్ర దేశంలో తొలి పామాయిల్ మొక్క నాటిన మహానుభావులని కొనియాడారు. పామాయిల్ సాగుతో ఈ ప్రాంత రైతాంగం పచ్చగా ఉన్నారని తుమ్మల పేర్కొన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరని.. తాను, పొంగులేటి శత్రువులం కాదని.. ఇద్దరం ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ లో మా ఇద్దరి ప్రయాణం జిల్లా అభివృద్ధి కోసమేనని తుమ్మల తెలిపారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబం ఉన్న పార్టీలో ఉన్నామని పేర్కొన్నారు. ప్రధాని పదవినే త్యాగం చేసిన చరిత్ర ఒక్క రాహుల్ గాంధీకే సొంతమని తుమ్మల పేర్కొన్నారు. విద్వేష రాజకీయంతో రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేసి ఇంటిని ఖాళీ చేయించారన్నారు. అవినీతి అరాచక పాలకులకు కాలం చెల్లిందని తుమ్మల పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలు సంతోషంగా ఉంటాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది కి పది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ నే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు.




కామారెడ్డి: అన్నదాతలను ముప్పుతిప్పలు పెట్టేందుకే కాంగ్రెస్ పట్వారీ వ్యవస్థను తీసుకొస్తామంటోందని రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కామారెడ్డిలో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్వారీ వ్యవస్థ కావాలా? ధరణి కావాలా? అనేది ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. భారాసనే.. రైతన్నకు భరోసా అని తెలిపారు. ధరణి ఎత్తేస్తే దళారుల రాజ్యం వస్తుందన్నారు. 24 గంటల కరెంట్ కావాలంటే భారాసకు ఓటు వేయాలని కోరారు. "తెలంగాణలో భారాస మళ్లీ అధికారంలోకి వస్తే తెల్లరేషన్ కార్డు ఉన్నవాళ్లందరికీ సన్న బియ్యం ఇస్తాం. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు 3వేలు ఇస్తాం. రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తాం. ధరణిలో ఉన్న చిన్న చిన్న లోపాలు సరిచేస్తాం" అని కేటీఆర్ తెలిపారు. "ఒకప్పుడు బోరు లేదు.. మోటార్లు లేవు.. నీరు లేదు.. ఆడబిడ్డలు మంచినీటి కోసం బిందెలు పట్టుకొని కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితులుండేవి. కరెంటు కోసం రైతులు సబ్‌స్టేషన్ల వద్ద గంటల కొద్దీ కూర్చునేవారు. మద్దతు ధర లభించేది కాదు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లోకి రావాలంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు భయపడేవారు. ఇలాంటి ఎన్నో దుర్భర పరిస్థితులను ప్రజలు ఒకసారి గుర్తు చేసుకోవాలి. ఎన్నో కష్టాలు, సమస్యలున్న తెలంగాణను మనకు అప్పజెప్పారు. ఈ పదేళ్ల కాలంలో తెలంగాణను ఎలా మార్చుకున్నామో ప్రజలు గమనించాలి. ఇవాళ తెలంగాణ రాష్ట్రం ఎన్నో రంగాల్లో దూసుకుపోతోంది. ఇదంతా సాధ్యం అయిందంటే.. మన నాయకుడు కేసీఆర్‌యే కారణం. రైతులకు పెట్టుబడి సాయం చేయాలనే ఆలోచన కాంగ్రెస్ నేతలకు ఎప్పుడైనా వచ్చిందా?రైతు బిడ్డ, రైతుల కష్టం తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టే ఇవాళ తెలంగాణలో వ్యవసాయం పండగలా మారింది. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో వేలపుట్ల ధాన్యం పండుతోంది. కరెంట్ కావాలో.. కాంగ్రెస్ కావాలో.. ప్రజలే ఆలోచించుకోవాలి" అని కేటీఆర్ అన్నారు.

# కేసీయార్ గాలి తీసేసిన చిదంబరం



హైదరాబాద్ : కేసీయార్ ఎన్నికల ప్రచారంలో ఒక్కటే మాట అంటున్నారు. ఈసారి బీయారెస్ గెలిస్తే కేంద్రంలో శాసిస్తామని, చక్రం తిప్పుతామని అంటున్నారు. కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో బీయారెస్ కీలకమైన పాత్ర పోషిస్తుంది అని కూడా అంటున్నారు. దేశంలో ప్రాంతీయ పార్టీల సంకీర్ణం ఏర్పడుతుందని కూడా జోస్యం చెప్పారు. సరిగ్గా ఈ పాయింట్ నే పట్టుకున్నారు కేంద్ర మాజీ హోం మంత్రి, తమిళనాడుకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత పి చిదంబరం. ఆయన కేసీయార్ మాటల మీద ఫైర్ అవుతూనే గాలి తీసేశారు. కేంద్రంలో చక్రం తిప్పుతామని కీలకం అవుతామని కేసీయార్ చెబుతున్నారని అసలు కేసీయార్ కి ఎన్ని సీట్లు వస్తాయని ఆయన నిలదీశారు. నిజానికి చూస్తే తెలంగాణాలో ఉన్న సీట్లే 17 ఎంపీలు. ఇందులో కేసీయార్ బీయారెస్ కి మొత్తానికి మొత్తం రానే రావు. ఆయనకు 2018లోనే 8 సీట్లు వచ్చాయి. ఇపుడు కూడా దానికి అటో ఇటో వస్తాయి. మరి ఈ తక్కువ నంబర్ సింగిల్ డిజిట్ నంబర్ తో కేసీయార్ కేంద్రంలో ఏమి చక్రం తిప్పుతారు అన్నదే చిదంబరం లా పాయింట్. అలా కేసీయార్ చెబుతున్న మాటలు అన్నీ ఊకదంపుడు అని నమ్మవద్దని ఆయన తెలంగాణా ప్రజలను కోరుతున్నారు అన్న మాట. ఇక హైదరాబాద్ స్టేట్ ని ఆనాటి ఆంధ్ర రాష్ట్రంతో కేంద్రంలోని కాంగ్రెస్ కలిపేసింది ఆది నుంచి కాంగ్రెస్ తెలంగాణాకు తీరని అన్యాయం చేస్తోందని, నిజమైన విలన్ అని కేసీయార్ అనేక సభలలో చెబుతున్నారు. దీని మీద కూడా చిదంబరం మండిపడ్డారు. కేసీయార్ కి చరిత్ర తెలుసునా అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయింది భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన అని ఆయన గుర్తు చేశారు. అలా దేశంలో చాలా చోట్ల రాష్ట్రాలు ఆవిర్భవించాయని చిదంబరం చెప్పుకొచ్చారు. అయితే తెలంగాణా అన్నది ఏర్పాటు సమయంలో కేసీయార్ ఏమి మాట్లాడారో గుర్తు చేసుకోవాలని ఆయన కోరారు. తెలంగాణా ఏర్పాటు తరువాత కేసీయార్ తాను ఇచ్చిన మాటలు అన్నీ పక్కన పెట్టారని అప్పుల కుప్పగా తెలంగాణాను మార్చారని ఆయన అన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని కూడా ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. కేసీయార్ ని దించేస్తేనే అభివృద్ధి జరుగుతుంది అని ఆయన అంటున్నారు.

మొత్తానికి ఒకనాడు తెలంగాణాను ఇచ్చి ఉమ్మడి ఏపీని విడగొట్టిన ఘనతను నాటి హోం మంత్రిగా చిదంబరం మూటగట్టుకున్నారు. ఇపుడు అదే చిదంబరం భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ఉమ్మడి ఏపీ ఏర్పడింది అని చెప్పడం విశేషం. మరి అలా ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ ని ఎందుకు విడగొట్టారో చిదంబరం అయినా చెప్పగలరా దానికి ఆయన లాజిక్ పాయింట్ ఏంటో కూడా చెప్పగలరా అన్నది ఇపుడు అందరూ అడుగుతున్న ప్రశ్న.

# కేసీఆర్ నాటిన మొక్క బీజేపీని నాశనం చేసింది



హైదరాబాద్: సీఎం కేసీఆర్ నాటిన ఒక మొక్క బీజేపీ పార్టీని నాశనం చేసిందని.. ఆ వ్యక్తిపై కేసీఆర్ పెట్టిన కేసులు ఏమయ్యాయి?.. బీజేపీ దానికదే నాశనం అయిందని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నాడు ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "బండి సంజయ్‌ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మార్చడంతోనే బీజేపీ గ్రాఫ్ పడిపోయింది. బండి సంజయ్‌ని సడెన్‌గా తీసేశారు. బండి సంజయ్‌ని తీసేయవద్దని చెప్పాను. సంజయ్‌ని తీసివేయడం లేదని మాకు చెప్పి సడన్‌గా అధ్యక్ష పదవీ నుంచి తప్పించారు. బీజేపీ తప్పు చేసింది కాబట్టే కాంగ్రెస్ పార్టీలో చేరాను. తెలంగాణ కోసం నా జీవితాన్ని త్యాగం చేశాను. ఉద్యమకారులకు బీజేపీ మాట ఇచ్చింది. కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని బీజేపీ నమ్మకాన్ని ఇచ్చింది కాబట్టే ఆ పార్టీలోకి వెళ్లాను. బీజేపీలోకి వెళ్లి నెలలు, సంవత్సరాలు గడిచినా కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేదు. కేసీఆర్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని మోదీనే అడుగుతున్నా. ఆధారాలు ఉన్నా కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. మోదీ, షా, నడ్డా తెలంగాణకి వచ్చినప్పుడల్లా కేసీఆర్‌పై ఆరోపణలు చేశారు. కానీ చర్యలు తీసుకోలేదు.మోదీకి మెజారిటీ ఉన్నా కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదు" అని విజయశాంతి ప్రశ్నించారు. "బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే. బీజేపీ కార్యకర్తలు పిచ్చోళ్లు. బీజేపీ బయటకి మాట్లాడేది ఒకటి. తెర వెనుక జరిగేది ఒకటి.

కేసీఆర్ అవినీతిపై కాంగ్రెస్ పోరాడుతోంది. కాళేశ్వరంపై బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. కొందరు మీడియా వ్యక్తులు నాపై ఘాటైన హెడ్‌లైన్స్ పెట్టారు. నన్ను తిట్టే హక్కు మీకు ఎక్కడిది. కేసీఆర్ ఇచ్చే డబ్బులకి లొంగిపోయే వ్యక్తిని కాదు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి నాపై మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకి మంచి బుద్ధి రావాలని కోరుకుంటున్నాను. నన్ను విమర్శించే వాళ్లు నోరు అదుపులో పెట్టుకోవాలి. కేసీఆర్ నన్ను సస్పెండ్ చేశారు. నేనే రాజీనామా చేశానని ప్రచారం చేశారు. కేసీఆర్‌ని గద్దె దింపడం కోసం ఎంత దూరమైనా వెళ్తా. ఆనాటి కాంగ్రెస్ నాయకుల్లో కొంతమందిని కేసీఆర్ కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి రావడం చాలా సంతోషంగా ఉంది. మా పార్టీ వాళ్లని కలుసుకోవడం ఆనందంగా ఉంది" అని విజయశాంతి అన్నారు.

**సంజయ్‌ను తొలగించడంతో భాజపా పరువు పోయింది:** మళ్లీ కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందని సినీనటి విజయశాంతి అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆమె తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భాజపాపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. " సీఎం కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని భాజపా చెబితే ఆ పార్టీలోకి వెళ్లాను. ఏళ్లు గడచినా ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. ఆధారాలు ఉండి కూడా భాజపా ఎందుకు చర్యలు తీసుకోలేదు? భాజపా, భారాస రెండూ ఒక్కటే. తెరపై విమర్శలు.. తెర వెనుక ఒప్పందాలు చేసుకున్నాయి. భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి సంజయ్‌ను తొలగించవద్దని కోరాం. సంజయ్‌ను తొలగించడంతో భాజపా పరువు పోయింది" అని విజయశాంతి విమర్శించారు.

# కేసీఆర్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు



ఖమ్మం: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తుందని కాంగ్రెస్ ప్రచార కమిటీ కో–కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలో కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి పాల్గొని మాట్లాడారు. "కాంగ్రెస్ కార్యకర్తలంతా ఐక్యతతో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అహంకారానికి పోకుండా పని చేయాలి. 10 ఏళ్లుగా ఈ ప్రాంతానికి పట్టిన దరిద్రాన్ని పోగొట్టేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలి. 10 రోజుల్లో 18 గంటలు కష్టపడి ఓటర్లను బూత్‌ల వరకు తీసుకువెళ్లాలి." అని విజ్ఞప్తి చేశారు. "అధికారంలో ఉన్న వ్యక్తికి హుజూరాబాద్‌లో వందల కోట్లు ఖర్చు పెట్టినా ఫలితం దక్కలేదు. అక్కడ వచ్చిన ఫలితమే సత్తుపల్లిలో వస్తుంది. డబ్బుతో రాజకీయం చేయలేం.. అది సాధ్యం కాదు. బడా బాబులు వచ్చి డబ్బుల సంచులు ఇచ్చినంత మాత్రాన సత్తుపల్లి ప్రజలు మోసపోరు. డబ్బుతో రాజకీయం చేయాలనుకోవడం మూర?త్వం. ఉద్యోగస్తులను జనం మీదకు పంపి వాళ్లను మార్చాలనుకోవటం అమాయకత్వం. కేసీఆర్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. డిసెంబర్ 9 తర్వాత తొత్తులకు, కబ్జాదారులకు అర్థం అవుతుంది. ప్రజా తీర్పునకు ఎంత పెద్ద మగాడైన తల వంచాల్సిందే. గ్రామాల్లో లీడర్ షిప్ ఎక్కువగా ఉంది. ఐక్యతగా పనిచేయాల్సిన అవసరం ఉంది. రెండో ఆలోచన లేకుండా సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీ గెలవాలి." అని పిలుపునిచ్చారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com